ఈనాడు
ఆదివారం
31 ఆగస్టు 2025



గుడ్‌మార్నింగ్... ఏఐ టీచర్!



కొత్త ఆలోచన... కాంట్రరీ థింకింగ్!



శ్రియ.. ఒకప్పుడు అగ్ర హీరోయిన్‌గా వెలిగిన ఈ భామ.. కాస్త విరామం తర్వాత మళ్లీ నటిగా రాణిస్తూనే అమ్మతనాన్నీ ఆస్వాదిస్తోంది. నాలుగు పదుల వయసులోనూ నాజూగ్గా కనిపిస్తూ.. వరస అవకాశాలతో తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని నిరూపిస్తోంది. త్వరలో 'మిరాయ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమైంది.


ఆరోజు ఎప్పటికీ గుర్తుండాలనీ...!

యాడ్ చూసి సినిమాలో అవకాశం

మాది హరిద్వార్. నాన్న ప్రభుత్వ ఉద్యోగి. అమ్మ టీచర్. దిల్లీలోని లేడీ శ్రీరామ్ కాలేజీలో చదివే రోజుల్లో క్యాంపస్‌లో జరిగే కార్యక్రమాల్లో బాగా డాన్స్ చేసేదాన్ని. ఒకసారి ఓ మ్యూజిక్ వీడియో యాడ్‌కు ఒకరు అవసరం కావడంతో మా టీచర్ నన్ను నటించమన్నారు. అలా మొదటిసారి కెమెరా ముందు కనిపించా. ఆ యాడ్ చూసిన రామోజీరావు గారు 'ఇష్టం' సినిమాలో అవకాశం ఇచ్చారు.

నా అదృష్టం

'నువ్వే నువ్వే'.. తండ్రీకూతుళ్ల బంధాన్ని అద్భుతంగా చూపిందా సినిమా. ఆ చిత్రంతో భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో నేర్చుకున్నాను. అంతేకాదు.. చిన్నవయసులోనే అగ్ర హీరోలందరితోనూ నటించే అదృష్టం నాకు దక్కింది. చిరంజీవి గారి డాన్స్‌లో గ్రేస్ అంటే చాలా ఇష్టం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం రజినీకాంత్‌గారిది.



అనుకోకుండా కలిశాం

పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయమవుతాయంటారు కదా.. నా విషయంలో అది నిజమేననిపిస్తుంటుంది. ఒకసారి మాల్దీవులకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఆండ్రూని కలిశా. తనది రష్యా. మాటల్లో మా ఇద్దరి ఇష్టాయిష్టాలూ, కుటుంబ నేపథ్యాలూ ఒకేలాంటివని అర్థమైంది. దాంతో అప్పటి నుంచి ఎక్కడికైనా కలిసే వెళ్లేవాళ్లం. పెద్దల అంగీకారంతో- సరిగ్గా ఏడాది తర్వాత- అంటే మేం మాల్దీవుల్లో మొదటిసారి కలిసిన రోజు ఎప్పటికీ గుర్తుండాలని- అదే తేదీన పెళ్లిపీటలెక్కాం.

అందుకే ఆ పేరు పెట్టాం

ప్రెగ్నెన్సీలో పెద్దగా ఇబ్బందులు రాలేదు కానీ, కరోనా పుణ్యమాని డెలివరీ అయ్యాక మాత్రం కాస్త ఇబ్బంది పడ్డాను. లాక్‌డౌన్‌తో ప్రపంచమంతా గందరగోళంలో ఉంటే... మా జీవితంలోకి పాప 'రాధ' రూపంలో ఓ అందమైన దేవదూత వచ్చిందని సంబరపడ్డాం. 'రాధ' అంటే రష్యన్ భాషలో 'సంతోషం' అని అర్థం. తనకు ఏడు నెలల వయసున్నప్పుడు నాకు కొవిడ్ పాజిటివ్ అని తెలిసింది. అప్పుడు రెండు వారాలపాటు పాపకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ పరిస్థితిని ఇప్పుడు తలుచుకున్నా కన్నీళ్లొచ్చేస్తాయి.

అదో పెద్ద టాస్క్

ఈ జనరేషన్‌కు పేరెంటింగ్ అనేది ఓ పెద్ద టాస్క్ అనే చెప్పాలి. అందుకే, పాప పుట్టాక షూటింగ్ నుంచి వీలైనంత తొందరగా వచ్చేస్తుంటా. ఏది మంచీ ఏది చెడూ అనే విషయాలను నేరుగా కాకుండా చిన్న చిన్న నీతి కథల రూపంలో తనకు చెబుతుంటా.

అదే నా సీక్రెట్

అందం, ఆరోగ్యం, ఫిట్‌నెస్.. ఈ మూడూ సొంతమవ్వాలంటే ఆహారం విషయంలో కచ్చితంగా ఉండాలి. నేను ప్రతి రెండుగంటలకోసారి ఏదో ఒకటి తింటుంటాను. చాక్లెట్లు, వేయించిన బాదం గింజలూ, పండ్లూ నా ఫేవరెట్ స్నాక్స్. ఉదయాన్నే నారింజ రసం తప్పనిసరి. కార్డియో, స్ట్రెచింగ్, ఈతతోపాటు రోజూ యోగా, ధ్యానం చేస్తుంటాను. ఇక అందం విషయానికొస్తే.. ఎక్కడికెళ్లినా రోజ్‌వాటర్, సెనగపిండిని వెంట తీసుకెళ్తా. వారానికోసారి సెనగపిండిలో పెరుగు కలిపి ముఖానికి పట్టిస్తా.



లోపల

మంచిమాట

తెలియటంకన్నా తెలియకపోవటమే చాలామందితో మాట్లాడిస్తూ ఉంటుంది. అధిక ప్రసంగానికి ప్రేరణ అజ్ఞానమే.

మీకు తెలుసా

జపాన్‌లో రోడ్లమీద కనిపించే వాడకంలో లేని ఫోన్‌బూత్‌లను తీసేయరు. వాటిని అక్వేరియంలుగా మార్చి... గోల్డ్‌ఫిష్‌లను పెంచుతారు. ఈ అక్వేరియాల్లో పెంచేందుకు రకరకాల చేపలు ఉన్నా... కేవలం గోల్డ్‌ఫిష్‌లను మాత్రమే ఎందుకు ఎంచుకున్నారంటే.. జపాన్‌లో వీటిని అదృష్టానికి సంకేతంగా భావిస్తారు. ఇలా వాటిని పెంచడం వల్ల మంచి జరుగుతుందనీ, కలిసొస్తుందనీ జపనీయుల నమ్మకం.

అలాగా!

మగవాడు పెళ్ళికి ముందు ఉన్నట్లే పెళ్ళి తర్వాత కూడా ఉంటే విడాకుల కేసులే ఉండవు, ఆడవాళ్ళు పెళ్ళి తర్వాత ఉన్నట్లు పెళ్ళికి ముందే ఉంటే అసలు పెళ్ళిళ్ళే జరగవు.

ఇవి 'వీగన్' గ్రామాలు..!

వీగన్... నగరాల్లో ఊపందుకుంటున్న ఆహార సంస్కృతి. పశుపక్ష్యాదులకి సంబంధించిన ఏ ఆహారాన్నీ తీసుకోకూడదన్నది వీళ్ల నియమం. సరిగ్గా దీన్నే కొన్ని వందల ఏళ్లుగా పాటిస్తున్నాయి తెలంగాణలోని ఆ రెండు గూడేలు. వీగన్‌లు జంతు సంబంధిత పదార్థాలకి దూరం కావడానికి ఆరోగ్యం కారణం అనుకుంటే... ఇక్కడి ప్రజలు అదేలాంటి నియమాలని పాటించడానికి కారణం... భక్తి. ఔను, ఈ గూడేలలోని ప్రతి ఒక్కరూ శైవులు. పుట్టిన 21వ రోజున మెడలో లింగధారణ చేస్తారు... మరణందాకా వాటిని వీడరు. అందుకే ఈ రెండు గూడేలకీ లింగధరిగూడెమనే పేరు! రెండూ మంచిర్యాల జిల్లాలోనే ఉన్నాయి. మొదటిది బెల్లంపల్లి మండలంలో ఉంటే... రెండోది అక్కడికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని తాండూరు మండలం పరిధిలోకి వస్తుంది. ఇక్కడి ప్రజలు మాంసంకానీ గుడ్లుకానీ పాలూపెరుగూ వంటివి కానీ ముట్టుకోరు. వీళ్లది వ్యవసాయాధారిత జీవనమైనా పశువుల్ని కానీ కోళ్లని కానీ పెంచుకోరు. అసలు మద్యం ఊసే ఎత్తరు. బయటివాళ్లెవరూ ఈ కట్టుబాట్లకి తట్టుకోలేరు కాబట్టి... ఈ రెండు గ్రామాలకి చెందిన కుటుంబాల మధ్యే పెళ్ళిళ్లు చేసుకుంటారు! వింతగా ఉంది కదూ?!



- రాజ్‌కుమార్, న్యూస్‌టుడే, బెల్లంపల్లి

'చప్పట్ల' కొలను!



ఇదో ప్రకృతి వింత. గోవా రాష్ట్రంలోని నేత్రాలి టౌన్‌కి దగ్గర గోపీనాథ్ ఆలయం అని ఉంటుంది. దాని వెనకో కొలను ఉంది. ఆ కోనేటి నీళ్లు చాలా స్వచ్ఛంగా ఉంటాయి... ఎంతగా అంటే అడుగునున్న నేల కూడా స్పష్టంగా కనిపించేటంత. అవన్నీ మామూలే కానీ... ఆ కొలను మెట్లపైన నిల్చుని గట్టిగా మాట్లాడినా... చప్పట్లు కొట్టినా చాలు.. ఆ శబ్దాన్ని బట్టి ఆ నీటిలో బుడగలొస్తాయి. మెల్లగా కొడితే చిన్న బుడగలూ, ఎక్కువ శబ్దం చేస్తే పెద్దవీ పైకి తేలుతాయన్నమాట. అందుకే ఈ కొలనుకి 'బుద్బుద తాలి' అని పేరు. ఆలయం వెనకున్న ఈ కొలను దగ్గరకొచ్చే భక్తుల మొరని దేవుళ్లు ఆలకిస్తున్నారు అనడానికి... ఈ బుడగలు సంకేతమని భక్తులు భావిస్తుంటారు. శాస్త్రవేత్తలేమో... ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న సల్ఫర్ ఆక్సైడ్ ఇందుకు కారణమంటున్నారు. కొలను అడుగుభాగంలో అవి చిన్న దిబ్బలుగా చేరిపోయి... శబ్దతరంగాలు తాకగానే పైకి వస్తూ... బుడగలుగా తేలుతున్నాయని వివరిస్తున్నారు.



ఆ కుక్కకి విగ్రహం పెట్టారు

ఊరకుక్కల మనుగడపైన వాడివేడిగా చర్చలు సాగుతున్న వేళ... కేరళలో ఓ వింత చోటుచేసుకుంది. అక్కడో గ్రామంలోని ప్రజలు ఓ వీధికుక్కకి ఏకంగా విగ్రహమే ఏర్పాటుచేశారు. అక్కడి బేకరీలో తయారయ్యే ప్రత్యేక కేకుకీ దాని పేరే పెట్టుకున్నారు. కేరళలో కొచ్చి దగ్గర్లోని తిరుప్పునిత్తుర టౌన్‌కి దగ్గరున్న ఏరూరు అనే గ్రామంలో ఈ వింత చోటుచేసుకుంది. ఇక్కడి ఆటో స్టాండ్ దగ్గర 2011లో ఓ బుజ్జి కుక్క కనిపించింది. అప్పటికే దాని శరీరం మీద కాలిన గాయం ఉందట. దాన్ని అక్కడి ప్రజలు చేరదీసి వైద్యం చేయించారు. 'ఎల్డో' అని పేరుపెట్టి... దానిపైన ప్రేమ కురిపించారు. అది కూడా ఆ ఊరికి జీతంలేని కాపలాదారుగా మారింది. ఆడపిల్లలూ చిన్నారులూ వృద్ధులూ రాత్రివేళల్లో ఊరుదాటి వెళ్లాలన్నా రావాలన్నా అది తోడుగా ఉండేది. అలాంటి కుక్క ఇటీవల చనిపోతే... దానికి ఊరివాళ్లందరూ కలిసి ఓ సంతాప సభ పెట్టారు. జాతీయ అవార్డు అందుకున్న శిల్పి జయన్ వీకేతో ఓ విగ్రహాన్ని రూపొందించి ఇటీవలే ఆవిష్కరించారు. ఈ ఊరిలో ఫేమసైన మిల్క్‌కేక్‌ని ఇకపైన... 'ఎల్డో కేక్' అనే పిలవాలని ఓ తీర్మానం కూడా చేశారు.



వాళ్లు 'ఛాయా' కానిస్టేబుళ్లు!




మనిషి మనసే అంత... ఏ నియమ నిబంధనలూ దానికి నచ్చవు. తప్పనిసరై పాటించినట్టు అనిపించినా... ఎప్పుడో ఓసారి అతిక్రమించాలనే చూస్తుంటుంది. మిగతా అంశాలకన్నా ట్రాఫిక్ రూల్స్ విషయంలో అది బాగా కనిపిస్తుంటుంది. దక్షిణకొరియా రాజధాని సియోల్‌లోనూ ఇదే వరస. అక్కడ ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కానరాని చోట... వాహనదారులు ఇట్టే ట్రాఫిక్ నియమాలని తుంగలో తొక్కేస్తున్నారట. దాంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. దాన్ని ఆపాలనే... సాంకేతికతతో ఓ అద్భుతం చేసింది ఆ దేశం. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేనిచోట... వాళ్ల బదులు 'హోలోగ్రామ్'లని ఏర్పాటుచేసింది. దూరం నుంచి చూడటానికి అసలైన కానిస్టేబులే అక్కడున్నట్టు అనిపించడంతో అక్కడ ట్రాఫిక్ అతిక్రమణలు గణనీయంగా తగ్గిపోయాయట. ఈ 'ఛాయా' ట్రాఫిక్ కానిస్టేబుళ్లు హోలోగ్రామ్ అని తెలిసినా సరే... బుద్ధిగా రూల్స్ పాటిస్తున్నారట! బావుంది కదూ?!





ఆదియోగి అయిన పరమేశ్వరుడు... లింగాకారంలో కాకుండా మానవరూపంలో మహాయోగిగా దర్శనం ఇస్తాడిక్కడ. నిలువెత్తు స్వామి రూపంతోపాటు మరో నాలుగు శివలింగాలు కొలువైన ఈ పంచలింగ క్షేత్రం హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయంగా సుప్రసిద్ధమైంది. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ దర్శనీయ స్థలం అనేక విశేషాలకు నెలవు.

లింగేశ్వరుడు... మానవ రూపంలో కనిపిస్తాడిక్కడ!



పురాతన కాలం నాటి నిర్మాణశైలిలో... ఆశ్చర్యపరిచే శిల్పకళా నైపుణ్యంతో... సుమారు పదిహేను ఎకరాల ప్రశాంత వాతావరణంలో కనిపిస్తుంది హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయం. దేశంలోని అరుదైన శైవక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయంలో శివుడు లింగాకారంలో కాకుండా మానవ రూపంలో సిద్ధయోగిగా దర్శనం ఇవ్వడం విశేషం. శ్రీసత్యసాయి జిల్లా, మడకశిరకు చేరువలో... అమరాపురం మండలం హేమావతి గ్రామంలోని ఈ గుడికి ఎంతో ప్రశస్తి ఉంది.

స్థల పురాణం

ఒకప్పుడు ఈ ఊరి పేరు హెంజేరు. స్థానిక పాలకులైన నొళంబ పల్లవరాజుల కులదైవం పరమేశ్వరుడు. ఈ వంశానికి చెందిన చిత్రశేఖర, సోమశేఖర సోదరులకు చాలా కాలం సంతానం కలగలేదట. ఓసారి పరమ శివుడు కల్లో కనిపించి... తనని పూజిస్తే సంతాన భాగ్యం కలుగుతుందనీ, ఆ తర్వాత లింగాకారంలో కాకుండా మానవ రూపంలో తన విగ్రహాన్ని ప్రతిష్ఠించమనీ ఆదేశించాడట. ఆ తర్వాత, కొన్ని రోజులకు ఈ వంశంలో హైమావతి అనే అమ్మాయి జన్మించడంతో స్వామి ఆజ్ఞ ప్రకారం ఆలయాన్ని నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారట. మరో కథ ప్రకారం... తమకు సంతానం కలిగే మార్గం చెప్పమంటూ ఆ సోదరులు రాజగురువులను సంప్రదించారట. తన దివ్యదృష్టితో వాస్తవాలు తెలుసుకుని, 'శివుడి శాపం వల్లే మీకు పిల్లలు కలగలేద'ని చెప్పాడా గురువు. పరిహారంగా మానవరూపంలోని శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించమని సూచించాడట. పరమేశ్వరుడి కటాక్షంతో ఆడపిల్ల జన్మించింది. ఆ బిడ్డకు హేమావతి అని పేరు పెట్టి అల్లారు ముద్దుగా పెంచారు. ఆమె వల్లే ఈ ప్రాంతానికి హేమావతి అనే పేరు వచ్చిందనీ... ఒకప్పుడు ఇక్కడ హేమానది ప్రవహించేదనీ అంటారు.

స్వామి పైన సూర్యకిరణాలు

సదాశివుడు సిద్ధేశ్వరుడిగా, నొళంబేశ్వరుడిగా కొలువైన ఈ ఆలయానికి మరో పేరు... పంచలింగ క్షేత్రం. ఇక్కడకు వచ్చే భక్తులకు ఆ నీలకంఠుడు సుమారు 5.8 అడుగుల ఎత్తులో పానవట్టంపైన కూర్చుని చతుర్భుజుడిగా పడమరవైపు దర్శనం ఇస్తాడు. ఢమరుకం, త్రిశూలం, భిక్షపాత్ర, అభయముద్రతో కటాక్షించే స్వామి శిరస్సుపైన సూర్యచంద్రుల రూపాల్ని స్పష్టంగా చూడొచ్చు. ఇతర ఆలయాలతో పోలిస్తే... స్వామికి అభిముఖంగా ఉన్న నంది విగ్రహం కాస్త పక్కకు తిరిగి ఉంటుంది. స్వామి దర్శనానంతరం... ఈ ప్రాంగణంలోనే మరో మూడు శివాలయాల్లో పూజలు చేసుకోవచ్చు. ఆ తర్వాత, ఆవరణ బయట ఉన్న మరో సన్నిధికీ చేరుకోవచ్చు. అన్నీ కలిపే దీన్ని 'అయిదు లింగాల ఆలయం'గా పిలుస్తారు. దొడ్డేశ్వర, మల్లేశ్వర, విరూపాక్షేశ్వర, సోమేశ్వర లింగాలుగా ప్రసిద్ధి అయిన నాలుగింటికీ బ్రహ్మసూత్రం ఉండటం గమనార్హం. సాక్షాత్తు బ్రహ్మదేవుడే యజ్ఞోపవీతాన్ని అలంకరించిన ఈ బ్రహ్మసూత్ర శివలింగాలు చాలా అరుదు. ఆలయంలో రామాయణ, భారత, భాగవత దృశ్యాలను చెక్కిన శిల్పాలూ భక్తులను ఆకట్టుకుంటాయి. కల్యాణిబావిగా పిలిచే పుష్కరిణిలోని పవిత్ర జలాలకు సర్వరోగనివారణిగా పేరు.

ఇక, చైత్ర, వైశాఖ మాసాల్లో సూర్యాస్తమయ సమయంలో స్వామి శిరస్సుపైన సూర్యకిరణాలు పడే వైనాన్ని చూసి తీరాల్సిందే. అదేవిధంగా, ఇక్కడున్న నంది విగ్రహాల్లో ఒకదాన్ని తడితే... లోహాన్ని తట్టిన శబ్దం వస్తుంది. ఇంకా... ఈ పల్లెకు 'శివలింగాల ఊరు' అనే పేరు కూడా ఉంది. అవును, స్థానికులు ఏ గృహ నిర్మాణం కోసమో తవ్వకాలు జరిపినప్పుడు తరచూ శివలింగాలు బయట పడుతుంటాయి. వాటన్నింటినీ ఇక్కడున్న మ్యూజియంలో చూడొచ్చు. అలాగే పరమేశ్వరుడి సోదరిగా భావించే నవకోటమ్మకూ విడిగా ఉపాలయం ఉంది. సంతాన ప్రదాత అయిన ఈ స్వామికి మహాశివరాత్రి సమయంలో వారం రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచీ వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

– **పి.విజయ్**, ఈనాడు: పుట్టపర్తి

ఫొటోలు: **రాజగోపాల్**, న్యూస్‌టుడే, మడకశిర

పరిశోధన

మాటతో క్యాన్సర్‌ని పసిగట్టేస్తుంది!



మీరు మాట్లాడే మాట- చెప్పాలనుకున్న విషయాన్నే కాకుండా, క్యాన్సర్‌గుట్టునీ బయటపెడితే? అవును, కంఠంలో వచ్చిన మార్పుల ఆధారంగా గొంతు క్యాన్సర్ గుట్టుని బయటపెట్టే విధంగా సరికొత్త ఏఐ టూల్‌ని అమెరికాకి చెందిన ఓరిగానో హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. దీనికోసం పదమూడువేలమంది పైన పరిశోధనలు చేసి ఈ క్యాన్సర్‌కి గల కారణాలని విశ్లేషించారు. పొగాకు సంబంధిత ఉత్పత్తులు తినేవారిలోనూ, హెచ్‌పీవీ వైరస్ ద్వారానూ ఈ క్యాన్సర్ బారినపడుతున్నారనీ, మెడభాగంలో ఉండే ఈ క్యాన్సర్ కణితిని ముందుగానే గుర్తిస్తే దీని నుంచి బయట పడటం తేలికనీ అంటున్నారు శాస్త్రవేత్తలు. సంప్రదాయ విధానంలో గొంతులోకి సన్నని పైప్‌ని పంపి, మరికొన్నిసార్లు కెమెరాని వాడి కూడా ఈ క్యాన్సర్‌ని గుర్తిస్తుంటారు. అలాంటప్పుడు ఒక వేళ నిపుణులు సరిగా కణితిని కనిపెట్టలేకపోతే, క్యాన్సర్ ఉన్నా బయటపడని సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయట. వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో కచ్చితంగా నిర్ధరించేందుకు వీలుగా ఈ 'బ్రిడ్జ్2-ఏఐ' అనే టూల్‌ని తీసుకొచ్చారు.

కళ్లద్దాల అవసరం లేదిక...

నలభైఏడేళ్లు దాటితే కంటిచూపులో మార్పులు రావడం మొదలవుతాయి. చిన్న అక్షరాలు స్పష్టంగా కనిపించవు, పట్టిపట్టి చదివితే తలనొప్పి మొదలవుతుంది. మరికొన్నిసార్లు అక్షరాలు అలికినట్టుగా ఉంటాయి. దీన్నే చత్వారం అనీ, ప్రెస్‌బయోపియా అనీ అంటారు. ప్రపంచవ్యాప్తంగా 180 కోట్లమంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వయసుతోపాటు వచ్చే ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యులు ఇంతవరకూ రీడింగ్ గ్లాసెస్‌నే సూచిస్తున్నారు. అయితే ఇకపైన వాటిని వాడాల్సిన అవసరం లేకుండా లెన్జ్ థెరాప్యుటిక్స్ అనే సంస్థ అసెక్లైడిన్ అప్తాల్మలాజిక్ సొల్యూషన్‌ని ఉపయోగించి విజ్ పేరుతో ఐడ్రాప్స్‌ని తీసుకొచ్చింది. వీటిని రోజులో ఒక్కసారి వాడితే చాలట. డ్రాప్స్ వేసుకున్న అరగంట తర్వాత నుంచి ఎటువంటి కళ్లద్దాల అవసరం లేకుండానే పదిగంటలపాటు కళ్లు స్పష్టంగా కనిపిస్తాయట. ప్రత్యేకమైన ఈ ఔషధం కంటిపాపలోని కండరాలపైన ఒత్తిడి తీసుకొచ్చి వాటి పరిమాణంలో మార్పు తీసుకొస్తుందట. దాంతో కళ్ల దగ్గర వస్తువులని స్పష్టంగా చూడగలుగుతాయట. అంటే ఇక వెళ్లిన ప్రతిచోటుకీ కళ్లద్దాలను తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా ఐడ్రాప్స్ వేసుకుని వెళ్తే సరిపోతుందన్నమాట.



అమ్మ బరువే పిల్లలకీ!

పిల్లల్లో ఊబకాయానికి, తల్లిదండ్రుల జన్యువులూ ఒక కారణమేనన్నది తెలిసిన విషయమే. కానీ పిల్లల బరువులో ముఖ్యంగా ఊబకాయంలో తల్లి పాత్రే ప్రధానంగా ఉంటోందని అంటోంది యూనివర్సిటీ కాలేజ్ లండన్ చేసిన ఓ అధ్యయనం. తల్లిదండ్రుల జన్యువులూ, బరువూ, వారి ఆహారపు అలవాట్లూ... పిల్లల బరువునీ, ఆహారపు అలవాట్లనీ ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకునేందుకు మూడువేల కుటుంబాలపైన ఒక పరిశోధన చేశారు. తల్లిదండ్రుల జన్యు వివరాలనీ, పిల్లలు పుట్టినప్పట్నుంచీ- పదిహేడేళ్లు వచ్చేంతవరకూ వారి బరువుని వివిధ దశల్లో విశ్లేషించారు. ఈ క్రమంలో... తండ్రి బరువు కన్నా, తల్లి గర్భిణిగా ఉన్నప్పటి బరువూ, గర్భం దాల్చడానికి ముందు ఉన్న బరువూ, అలాగే ఆమె ఆహారపు అలవాట్లూ, పిల్లలకు మూడేళ్లు వచ్చేంతవరకూ ఇంట్లో పాటించే ఆహార నియమాలే పిల్లల బరువుని నిర్ధరిస్తాయని ఈ పరిశోధనలో తేలింది. అంతేకాదు చదువుకున్న తల్లులకు పుట్టిన పిల్లల్లో కన్నా, పెద్దగా చదువుకోని తల్లులకు పుట్టిన పిల్లలు బరువు ఎక్కువగా ఉండటాన్ని కూడా గమనించారు. అంటే జన్యువులతోపాటు తల్లులు పాటించే చక్కని ఆహారపు అలవాట్లే పిల్లల భవిష్యత్ బరువుని నిర్ధారిస్తాయన్నమాట.



సూపర్ స్లీపర్స్... గుట్టు తెలిసింది!

రోజులో ఎనిమిది నుంచి తొమ్మిది గంటల నిద్ర లేకపోతే అల్జీమర్స్‌వంటి వ్యాధులు రావొచ్చని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు కొందరు నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయినా ఏ అనారోగ్యాలూ లేకుండా హుషారుగా ఉంటున్నారు. తక్కువ నిద్రపోయినా అనారోగ్యాలు లేకుండా వాళ్లు ఎలా హుషారుగా ఉంటున్నారో తెలుసుకునేందుకు చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. ఎస్ఐకె-3, ఎన్783వై అనే అరుదైన జన్యువులే ఇందుకు కారణమని పరిశోధకులు తేల్చారు. ఈ రకమైన జన్యువులున్నవారిని షార్ట్ స్లీపర్స్ అనీ సూపర్ స్లీపర్స్ అనీ అంటున్నారు. అంత తక్కువ నిద్రలో కూడా కణాలు మరమ్మతు పనులూ, శరీరంలో వ్యర్థాలని తొలగించడంవంటి పనులూ ఎలా జరిగేవి అలా జరిగిపోతుంటాయట. ఈ జన్యువులని నిద్రలేమితో బాధపడేవారికీ, అల్జీమర్స్ వంటి సమస్యలతో ఇబ్బందిపడేవారికీ అందించడం ద్వారా ఆయా సమస్యల నుంచి ఉపశమనం ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



మామూలుగా ఊరికి ఏదైనా సమస్య వస్తే... గ్రామస్థులందరూ కలిసి పరిష్కరించుకోవడమో, అంతకు మించిన పనైతే ప్రభుత్వాన్ని ఆశ్రయించడమో చేస్తుంటారు. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలంలోని ఏడిద గ్రామ ప్రజలు మాత్రం పని చిన్నదైనా, పెద్దదైనా పురుషోత్తమరావునే కలుస్తారు. ఎందుకంటే, ఆయన ఎంతైనా ఖర్చు పెడుతూ ఊరి బాగోగులు చూస్తారు. బడికీ కాలేజీకీ అవసరమైన భవంతుల్ని కట్టించడం దగ్గర్నుంచి రోడ్లు వేయించడం, ఆసుపత్రి నిర్మించడం... వరకూ ఎన్నో మంచి పనులు చేశారు. ఊరిని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతున్న ఆయన సేవా ప్రస్థానం ఓ స్ఫూర్తి పాఠమే!



పల్లెను మార్చిన... పురుషోత్తముడు!



ఎక్కడైనా జిల్లా, మండల స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ వచ్చిన ఇంటర్, పదో తరగతి విద్యార్థులను అభినందిస్తూ నగదు బహుమతులు ఇస్తుంటారు. ఏడిదలోని బడిలోనూ అలాంటి ప్రోత్సాహకాలే ఇస్తారు. కాకపోతే పది వేలో, ఇరవై వేలో కాదు... పదో తరగతిలో ఎక్కువ మార్కులు తెచ్చుకున్నవాళ్లకు రూ. రెండు లక్షలూ, ఇంటర్లో ఫస్ట్ ర్యాంక్ వచ్చినవారికి రూ. అయిదు లక్షలూ అందిస్తున్నారు. పేదరికం కారణంగా ప్రతిభావంతులు మధ్యలోనే చదువు ఆపేయకూడదనే ఉద్దేశంతోనే ఈ సరికొత్త ఆలోచన చేశారు నామాల పురుషోత్తమరావు. ఇలా స్కాలర్‌షిప్స్‌తో విద్యార్థుల్ని ప్రోత్సహించడమే కాదు, ఆ ఊళ్లోని పిల్లలందరూ బాగా చదువుకోవడానికి అవసరమైన సౌకర్యాలకూ, గ్రామస్థులకు కావాల్సిన వసతులకూ లక్షల్లో సొంత డబ్బు ఖర్చుపెడుతున్నారు. అందుకు కారణం ఏమిటో, ఈ సత్కార్యం ఎలా సాధ్యమైందో తెలియాలంటే పురుషోత్తమరావు గురించి తెలుసుకోవాల్సిందే!

చదువుతోనే విజయం...

ఊరి సమస్యల్ని తీర్చడానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ఈ శ్రీమంతుడు- సాధారణ రైతు కుటుంబంలో పుట్టారు. చిన్నప్పటి నుంచీ 'ఒక వ్యక్తి జీవితాన్ని పూర్తిగా మార్చేది విద్య ఒక్కటే' అన్న మాటను బలంగా నమ్ముతూ చదువు మీదే దృష్టిపెట్టారు. అలా పదో తరగతి వరకూ గ్రామంలోనే చదువుకుని, ఆ తర్వాత, దగ్గర్లోని రామచంద్రాపురంలో డిగ్రీ పూర్తి చేశారు. బీఎస్సీ అయ్యాక... 1980లో హైదరాబాద్‌లోని ఒక ఫార్మా కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరారు. తన ప్రతిభతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. అలా పద్నాలుగేళ్లు గడిచిపోయాయి. అప్పుడే సొంతంగా ఓ ఫార్మా కంపెనీని మొదలుపెట్టాలన్న ఆలోచన వచ్చింది ఆయనకి. స్నేహితులూ, బంధువుల సాయంతో పెట్టుబడి డబ్బుల్ని కూడబెట్టుకున్నారు. అందరి అండతో 1994లో 'పోరస్ ఫార్మా ఇండస్ట్రీస్'ను స్థాపించారు. కష్టపడితే ఫలితం తప్పక లభిస్తుందనే నమ్మకంతో సంస్థ ఎదుగుదల కోసం పగలూరాత్రీ శ్రమించారు. వ్యాపారం అన్నాక ఒడుదొడుకులూ సర్వసాధారణమే కదా. వాటన్నింటినీ తట్టుకుని నిలబడ్డారు. అనేక విజయాలు అందుకుంటూ కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తన ఉన్నతిలో జన్మభూమినీ భాగం చేస్తూ- ఊరికి తనవంతుగా ఏదైనా చేయాలనుకున్నారు. సరిగ్గా అప్పుడే, గ్రామస్థులు బడిని బాగు చేయమని అడిగారు. ఆ మంచిపనితో మొదలు పెట్టి... ఒక్కొక్కటిగా ఊరి సమస్యలన్నీ తీరుస్తూ వస్తున్నారు!

ఏమేం చేశారు...

దాదాపు ఇరవై వేల జనాభా కలిగిన గ్రామం ఏడిద. అక్కడి హైస్కూల్‌లోనే ప్రభుత్వం 'ప్లస్ టూ'నూ తీసుకొచ్చింది. అందుకు అవసరమైన భవన నిర్మాణానికి, ల్యాబ్ ఏర్పాటుకు అయిన ఖర్చంతా పురుషోత్తమరావే భరించారు. అందుకు దాదాపు రెండున్నర కోట్ల రూపాయలు వెచ్చించారు. రూ. 90 లక్షల నిధులతో మూడంతస్తుల భవనాన్ని నిర్మించి... కంటి ఆసుపత్రినీ, గ్రంథాలయాన్నీ, సమావేశ మందిరాన్నీ ఏర్పాటుచేశారు. ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి సరైన రహదారి లేదని తెలిసి... రూ. 20 లక్షలతో రోడ్డు వేయించారు. చదువూ, ఆరోగ్యం అన్నింటి కంటే ముఖ్యమంటూ, వాటి కోసం ఎంతైనా సాయం చేస్తున్నారు. గ్రామస్థులు వాకింగ్ చేయడానికి సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని, రూ. అయిదు కోట్ల రూపాయలతో... ఊరి చెరువు దగ్గర ఆధునిక హంగులతో విశాలమైన పార్కునీ, వాకింగ్ ట్రాక్‌నీ ఏర్పాటు చేశారు. ఇందుకోసం చెరువు గట్టు దగ్గరున్న పాకల్ని ఖాళీ చేయించి, వాళ్లకు వేరే చోట ఇంటి స్థలాల్నీ ఇప్పించారు. తాను చదువుకున్న డిగ్రీ కాలేజీ అభివృద్ధి కోసం కోటిన్నర రూపాయలు ఇవ్వడానికి ముందుకొచ్చారు. 'సొంతూరికి ఎంత చేసినా తక్కువే' అంటూ దొడ్డ మనసును చాటుకుంటున్నారు పురుషోత్తమరావు. ఎంత ఎదిగినా పుట్టిన ఊరికి ఎంతో కొంత తిరిగిచ్చేయాలన్న ఆయన సేవాసంకల్పం అభినందించదగ్గదీ, అందరూ ఆచరించదగినదీ!









సహకారం: జె. సాయిసత్యనారాయణ, న్యూస్‌టుడే, ద్వారపూడి



జిప్ పోయినా పెట్టేయొచ్చు!

జాకెట్లూ,స్వెటర్లూ, బ్యాగుల్లాంటివి అంతా బాగున్నా జిప్స్ పాడైపోయాయని పక్కన పెట్టేస్తుంటారు చాలామంది. కానీ ఒక చిన్న వస్తువుతో ఎప్పటిలాగే వాటన్నింటినీ వాడుకోవచ్చు. అదే ఇక్కడున్న 'యూనివర్సల్ జిప్పర్ రిపేర్ కిట్'. ఊడిపోయిన జిప్ దగ్గర దీన్ని పెట్టి ముందరున్న స్క్రూని బిగించేసి అలా పైకి లాగేసుకోవచ్చు. క్షణంలో మనమే జిప్‌ను పెట్టేసుకోవచ్చన్నమాట. అత్యవసర సమయాల్లో ఈ డిటాచబుల్ జిప్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

వేడి నీళ్ల కుళాయి!



గీజర్ లేకుండానే కూరగాయలూ, పాత్రల్ని శుభ్రం చేయడానికి సింకులో కుళాయిలోంచే వేడి నీళ్లు వస్తే ఎంత హాయిగా ఉంటుందో కదా! ఆ వెసులుబాటునే తీసుకొస్తున్నాయి ఈ 'ఇన్‌స్టంట్ ఎలక్ట్రిక్ వాటర్ హీటర్ ట్యాప్స్'. చిన్న హీటర్‌తోపాటు వచ్చే ఈ ట్యాప్ సెటప్‌ను మామూలు కుళాయిల్లాగే సులువుగా అమర్చుకోవచ్చు. ఆన్ చేసుకున్నాక ఉష్ణోగ్రతల్ని పెంచుకోవచ్చు కూడా. చల్ల నీళ్లూ, వేడి నీళ్లూ... ఏవి కావాలంటే వాటిని అందించే ఈ ట్యాప్స్‌మీద వాటి ఉష్ణోగ్రతల్ని తెలిపే డిస్‌ప్లే కూడా ఉంటుంది.

షాపింగ్

ఒకేసారి రెండు మిక్సీ పట్టొచ్చు!

పొద్దున సమయం ఎంత ముఖ్యమో గృహిణులకే తెలుసు. టిఫిన్లూ, కూరలూ చేస్తూ కిచెన్‌లో వంటలతో కుస్తీ పట్టినట్టే ఉంటుంది. అది తెలిసే తయారీదారులు- ఉన్న కొద్ది సమయంలోనే వంట పూర్తిచేయడానికి ఉపయోగపడే వస్తువు లెన్నింటినో తీసుకొస్తుంటారు. అలా ఈమధ్య 'ఎలక్ట్రిక్ టూ ఇన్ వన్ బ్లెండర్' వచ్చేసింది. ఈ మినీ మిక్సీలో ఒకేసారి రెండు జార్లు కలిపి పెట్టుకుని ఆ రెండింటిలో ఉంచిన పదార్థాల్ని ఒకేసారి మిక్సీ పట్టుకోవచ్చు. కావాలంటే ఆ జార్లను విడిగానూ వాడుకోవచ్చు. ఈ కొత్తరకం మిక్సీ- గృహిణుల్ని తప్పకుండా మెప్పిస్తుంది!



దువ్వెనే రంగు వేస్తే!



ఒక వయసు వచ్చాక తెల్లజుట్టు రావడం మామూలే. సమయం ఉంటే వారానికోసారి డై వేసుకోవడం, హెన్నా పెట్టుకోవడం చేస్తుంటారు. కానీ కొన్నిసార్లు అనుకోకుండా బయటికి వెళ్లాల్సి వస్తుంది. మరికొన్నిసార్లు కేవలం పాపిట దగ్గర తలపైన కనిపించే చోట్ల మాత్రమే తెల్ల వెంట్రుకలు కనిపిస్తుంటాయి. సరిగ్గా అలాంటి సందర్భాల్లోనే 'క్విక్ కవర్ గ్రే హెయిర్ టచప్ కోంబ్' బాగా ఉపయోగపడుతుంది. జుట్టు కుదుళ్ల దగ్గరా, నెరిసిన వెంట్రుకలపైనా దాంతో దువ్వితే చాలు. దువ్వెనలోనే డై ఉంటుంది కాబట్టి క్షణాల్లో నల్లగా మారిపోతుంది జుట్టు అంతా. ఈ డై దువ్వెనను ఎక్కడైనా ఎప్పుడైనా ఎంచక్కా వాడుకోవచ్చు.



ఇది అతికించే పెన్ను!

చదివేది ఒకటీ రెండూ తరగతులే అయినా పెన్నులూ, పెన్సిళ్ల నుంచి గ్లూ బాటిల్ వరకూ రకరకాల స్టేషనరీ వస్తువులన్నీ ఉండాల్సిందే అంటారు పిల్లలందరూ. హోంవర్క్‌లో భాగంగానో, సరదాగానో ఏదో ఒక క్రాఫ్ట్ చేస్తూనే ఉంటారు. అందులో ఏవైనా అతికించాల్సి వస్తే గ్లూ బాటిళ్లను అడ్డదిడ్డంగా వాడేస్తుంటారు. చేతులకూ రాసేసుకుంటారు. ఆ ఇబ్బందిని తప్పించడానికే వచ్చింది 'గ్లూ పెన్'. మామూలు పెన్నులాగే అవసరమైనచోట దీంతో రాస్తే చాలు, గమ్ కాగితం మీద పడుతుంది. అంతేకాదు, దీంతో మనకు కావాల్సినట్టే గ్లూని రాయొచ్చు. ఉదాహరణకు ఏదైనా పూల కాగితాల్ని తయారు చేస్తున్నప్పుడు వాటన్నింటినీ అతికించుకోవడానికి మొత్తమంతా రుద్దకుండా సన్నని చుక్కల్లాగో, గీతల్లాగో గ్లూని పెట్టుకోవచ్చు. ఇంకా కాగితం మీద గ్లూతో పేర్లు రాస్తూ, అందమైన డిజైన్లు వేస్తూ దాని మీద మెరుపులూ అతికించుకోవచ్చు.



మ్యాజిక్ కోల్... ఒక్కటి చాలు!

ఇంట్లో ధూపం వేసుకునేప్పుడూ, పిల్లలకు సాంబ్రాణి పొగ కోసమూ నిప్పు అవసరం అవుతుంది. కానీ ఒకప్పటిలా బొగ్గులతో అలా నిప్పుల్ని రాజేయడం అన్నది కుదరట్లేదు. అవి త్వరగా మండవు కూడా. అందుకు పరిష్కారంగానే 'మ్యాజిక్ కోల్స్' దొరుకుతున్నాయి ఇప్పుడు. వాటిని వెలిగించి సులువుగా ధూపం వేసుకోవచ్చు. పైగా ఎక్కువసేపు మండుతూ ఉంటాయివి. నిప్పు అవసరమైనప్పుడు వీటిని ఎంచుకుంటే శ్రమ లేకుండా పని అయిపోతుంది!



వందలో ఒకరిగా మందలో కలిసిపోవడం చాలా సులభం. పెద్దగా ఆలోచించాల్సిన అవసరం రాదు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పనుండదు. ఆ గుంపుతో తెగతెంపులు చేసుకుని మనకంటూ ఓ ఉనికిని చాటుకోడానికి మాత్రం చాలా కష్టపడాలి. ఎంతో ధైర్యం ఉండాలి. వ్యవస్థకు ఎదురీదాలి. అనేక యుద్ధాలు చేయాలి. 'కాంట్రరీ థింకింగ్'తోనే ఆ తెగువ వస్తుంది. దాంతోపాటే, మనదైన ఆలోచనా విధానమూ సొంతం అవుతుంది. అదే విజయానికి రాచమార్గం.



కొత్త ఆలోచన... కాంట్రరీ థింకింగ్!

పదిమందీ ఒకేలా ఆలోచిస్తున్నారంటే, అసలెవరూ ఆలోచించడం లేదని అర్థం.

వందమందికీ ఒకే అభిప్రాయం ఉందంటే, అక్కడ అంతమంది అవసరమే లేదని భావం.

అంత మూస ఎంతమాత్రం మంచిది కాదు... వ్యక్తికైనా, వ్యవస్థకైనా. అప్పటి వరకూ ఉన్న నిశ్శబ్దం ఏదో ఒకరోజు బద్దలవుతుంది. ఆ గుంపులోంచే ఎవడో ఒకడు తప్పక పుట్టుకొస్తాడు. భ్రమల్ని వదలగొడతాడు. పాతకు పాతరేస్తాడు. కొత్తకోణాన్ని ఆవిష్కరిస్తాడు. సరికొత్త వాదనను లేవదీస్తాడు.

ఆ మాటలు వినగానే... కొందరు నవ్వేస్తారు, కొందరు ఎగతాళి చేస్తారు, కొందరు కోప్పడతారు, కొందరు దాడికి తెగబడతారు.

అయినా అతను తడబడడు. తలవంచుకుని నిలబడడు. తానొక్కడూ ఒకవైపూ, ప్రపంచమంతా మరోవైపూ... అయినా సరే! ఒంటరి పోరాటానికి సందేహించడు. 'కాంట్రరీ థింకింగ్'తో వచ్చిన తెగువే ఇదంతా. దీన్నే 'కాంట్రేరియన్ థింకింగ్' అనీ పిలుస్తారు.

'ఊరందరిదీ ఒకదారి, ఉలిపి కట్టెది ఒకదారి... అనుకుంటే అనుకోనివ్వండి. మందను కాదని, తనదైన మార్గాన్ని ఎంచుకున్నందుకు ఆ ఉలిపి కట్టెను అభినందించి తీరాల్సిందే' అని కితాబు ఇస్తుంది 'కాంట్రరీ థింకింగ్'.

విజేతల గెలుపు-మలుపులలో, విశ్వ కుబేరుల పొదుపు-మదుపులలో 'కాంట్రరీ థింకింగ్' అంతర్లీనం. అలా అని, ఇదేం కొరుకుడుపడని విషయం కాదు. గణిత సూత్రాలూ, రసాయన సమీకరణాలూ ఇబ్బంది పెట్టవు. 'కాంట్రరీ థింకింగ్' ఏకవాక్య సిద్ధాంతం... మూసకు భిన్నంగా ఆలోచించడం, అంతే! ఈ ఫార్ములాను ఒంటబట్టించుకుంటే... అన్నిదారులూ మూసుకుపోయినా సరే, మనకంటూ ఓ కొత్త మార్గాన్ని నిర్మించుకుంటాం. అందరూ, అవునని తలూపుతున్నప్పుడు కూడా కానేకాదంటూ పదునైన వాదనను లేవనెత్తుతాం. అందరూ, అసాధ్యమంటూ చేతులెత్తేసినప్పుడు సైతం కచ్చితంగా సాధ్యమేనంటూ చేయి పైకెత్తుతాం.

అలా... ఎలా?

ప్రతి మనిషిలోనూ పుట్టుకతోనే ఓ 'కాంట్రేరియన్ థింకర్' ఉంటాడు. పసిపిల్లల్ని కదిలించి చూడండి. ఎంత కొత్తగా ఆలోచిస్తారో! ఎన్ని చిక్కు ప్రశ్నలు అడుగుతారో! ఓపిక లేకనో, జవాబు తెలియకనో మనం విసుక్కోవడం మొదలుపెట్టేసరికి, చిన్నబుచ్చుకుని ప్రశ్నించడం మానేస్తారు. దీంతో తలపుల తలుపులన్నీ మూసుకుపోతాయి. మనదీ దాదాపుగా అదే పరిస్థితి. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆ ద్వారబంధాన్ని పగలగొట్టాలి. మనలోని వినూత్న ఆలోచనాపరుడిని నిద్రలేపాలి. ప్రశ్నించడం ప్రారంభించాలి. పుస్తకం చదువుతున్నా, పాడ్‌కాస్ట్ వింటున్నా, సినిమా చూస్తున్నా, ఎవరితోనో మాట్లాడుతున్నా... ఏదో ఓ మెరుపులాంటి పాయింట్‌ను పట్టుకునే ప్రయత్నం చేయాలి. కొత్తకోణాలేం కొత్తగా పుట్టుకురావు. పాత వెనకాలే దాక్కుని ఉంటాయి. మనమే, కనిపెట్టి బయటికి లాగాలి. 'కాంట్రరీ థింకింగ్'కు ఆ చిట్కా తెలుసు.

రివర్స్ గేర్‌లో...

'పిల్లి కనుక తాను సింహం కావాలనుకుంటే, ముందుగా ఎలుకను వేటాడటం మానేయాలి'... అంటుంది 'కాంట్రరీ థింకింగ్'. పిల్లికి ఎలుకల వేట కొట్టినపిండి. మూషికం బలాలూ బలహీనతలూ తెలుసు కాబట్టి, ఎప్పుడూ వైఫల్యం ఉండదు. అదే మరో జీవిపైన అయితే అంత సులభంగా గెలవలేదు. కొత్త శత్రువును వేటాడాలంటే, పాత నైపుణ్యాలు సరిపోవు. ఊహకందని వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి. అప్పుడే, ఆ పిల్లికి సింహయోగం. 'ఆపిల్'ను అగ్రస్థానంలో నిలబెట్టడానికి స్టీవ్‌జాబ్స్ ఎంచుకున్న మార్గమూ ఇలాంటిదే. 'నోకియా', 'బ్లాక్‌బెర్రీ' లాంటి కంపెనీలు కీబోర్డ్ సెల్‌ఫోన్లతో మార్కెట్‌ను ఏలేస్తున్న సమయంలో... స్టీవ్‌జాబ్స్ 'కాంట్రరీ థింకింగ్' మొదలుపెట్టాడు. 'అసలు, సెల్‌ఫోన్‌కు కీబోర్డు అవసరమా?' అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. అప్పుడు పుట్టిందే 'టచ్‌స్క్రీన్ డిజిటల్ కీబోర్డ్'. సెల్‌ఫోన్ పరిణామ క్రమంలో ఇదో పెద్ద మలుపు.

ప్రజా క్షేత్రంలో...

రాజకీయాల్లో నాయకులు గెలవరు. వ్యూహాలే గెలుస్తాయి. ఎన్నికల్లో ప్రతి అభ్యర్థీ తన గెలుపు కోసం ఎన్నో వాగ్దానాలు చేస్తాడు. కానీ, కొందరు మాత్రం గెలిపించే వాగ్దానాలే చేస్తారు. జనం గుండెల్లో నాటుకుపోయే నినాదాలు అందుకుంటారు. ఆ సాధన సంపత్తి 'కాంట్రరీ థింకింగ్'తోనే లభిస్తుంది. ఈ విషయంలో, తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో దివంగత ఎన్టీఆర్ నిలువెత్తు ఉదాహరణ. ఎన్నికల ప్రచారానికి ఆయన సినిమా గ్లామర్ అద్దారు. అతి సామాన్యులను అభ్యర్థులుగా నిలబెట్టారు. మహిళలకు పెద్దపీట వేశారు. జాతి ఆత్మాభిమానాన్ని ప్రచార అస్త్రంగా ఎంచుకున్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం లాంటి జనాకర్షక పథకాలను పరిచయం చేశారు. ఉపన్యాసాల్లోనూ ఎంతో ఉత్తేజం. ఆయన సభలకు జనం జాతరకు వచ్చినట్టు వచ్చేవారు. ఆ ప్రయోగం ఫలించింది. తెలుగుదేశం 'సూపర్ హిట్' అయ్యింది. జాతీయ రాజకీయాల విషయానికొస్తే... ఇందిరా గాంధీ, అద్వాణీ, మోదీ తదితరులు కూడా ఆ కోవలోకే వస్తారు.



'థింక్ డిఫరెంట్'... స్టీవ్‌కు ఇష్టమైన నినాదం. 'కాంట్రరీ థింకింగ్' మూలసూత్రం కూడా ఇదే.

'నాసా' సహా ప్రపంచంలోని అంతరిక్ష పరిశోధన సంస్థలన్నీ పునర్వినియోగానికి పనికిరాని స్పేస్‌క్రాఫ్టలలో ఉపగ్రహాల్ని నింగిలోకి పంపుతున్న సమయంలో... ఎలాన్ మస్క్ బుర్రలో ఓ 'కాంట్రరీ' ఆలోచన తళుక్కుమంది. ఇక, ఉగ్గబట్టుకోలేక... 'రైళ్లూ విమానాలూ ప్రయాణికుల్ని గమ్యంలో దించేసి, వెనక్కి వచ్చేస్తున్నప్పుడు, స్పేస్‌క్రాఫ్ట్‌ను మాత్రం ఎందుకు వెనక్కి రప్పించలేం? మళ్లీ మళ్లీ ఎందుకు ఉపయోగించలేం?' అని కుతూహలంగా అంతరిక్ష శాస్త్రవేత్తలను అడిగాడు. సైంటిస్టులు ఎగాదిగా చూసి, ఎగతాళిగా నవ్వారు. 'తెలియని విషయాల్లో తలదూర్చి చేతులు కాల్చుకోవద్దు' అని హెచ్చరించారు. అయినా, మస్క్ తన ప్రయత్నాలు ఆపలేదు. స్పేస్-ఎక్స్ ఏర్పాటులో వెనక్కి తగ్గలేదు. అంతిమ విజయం 'కాంట్రరీ థింకింగ్'దే! మస్క్ అనుకున్నది సాధించాడు. ఆయన ప్రయోగించే రాకెట్‌లు అప్పగించిన పనిని పూర్తి చేసుకుని, అంతే వేగంగా భూమికి తిరిగొచ్చేస్తాయి. మళ్లీ ఇంకో బరువును భుజాన వేసుకుని ఆకాశం వైపు దూసుకుపోతాయి.

కాలిఫోర్నియా గోల్డ్‌రష్ గురించి వినే ఉంటాం. అక్కడ, హఠాత్తుగా బంగారం గనులు బయటపడ్డాయి. తవ్వినకొద్దీ పచ్చలోహమే. జనం తండోపతండాలుగా సంపద వేటకు బయల్దేరారు. శామ్యూన్ బ్రానన్ అనే వ్యక్తి మాత్రం... మందలో కలిసిపోకుండా ఓ పక్కన నిలబడి, ఆ పరిణామాల్ని శ్రద్ధగా గమనించాడు. మార్కెట్‌లో బంగారం తవ్వకాలకు అవసరమైన పనిముట్ల కొరత తీవ్రంగా ఉన్నట్టు అతనికి అర్థమైపోయింది. వెంటనే ఆ వ్యాపారాన్ని ప్రారంభించాడు. అందరూ బంగారం వెంట పరుగులు తీస్తున్నప్పుడు కూడా... కాంట్రరీ థింకర్ అంతకంటే విలువైన దాని గురించి ఆలోచిస్తాడు.

'కాంట్రరీ' పెట్టుబడులు

ఇన్వెస్టర్... అన్ని సమయాల్లోనూ ఆశావాదిగా ఉండకూడదు. అలా అని, నిత్య నిరాశావాదమూ పనికిరాదు. అవసరమైతే 'కాంట్రరీ థింకర్'గా మారిపోవాలి. వారెన్ బఫెట్ నుంచి రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా వరకూ... ఎంతోమంది స్టాక్ మార్కెట్ మాంత్రికుల విజయ రహస్యం ఇదే. అందరూ నష్టభయంతో అమ్మేస్తున్నప్పుడు చవకగా కొనేయడం, అందరూ లాభాల ఆశతో ఎగబడి కొంటున్నప్పుడు మంచి ధరకు అమ్మేసుకోవడం... అంటే మందకు వ్యతిరేకంగా స్పందించడం... విశ్వ కుబేరుడు వారెన్ బఫెట్ చిరకాల వ్యూహం. దాదాపు రెండు దశాబ్దాల క్రితం, అమెరికా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఆ దెబ్బకు స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది. ఇక పైకి లేవడం అసాధ్యమనే నిర్ణయానికొచ్చారు మదుపర్లు. ఆ సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా, 'ఇదే సరైన సమయం. మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయండి' అనే సలహా ఇచ్చాడు బఫెట్. తను సిఫార్సు చేసిన ఒక్క గోల్డ్‌మన్ శాక్స్ షేర్ల విలువే... తదుపరి పదేళ్లలో ఎన్నో రెట్లు పెరిగింది. ఇదే పద్ధతిలో భారతీయ స్టాక్ మార్కెట్‌లో 'కాంట్రరీ'గా కాసుల పంట పండించుకున్న వ్యక్తి... రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా. నాలుగు దశాబ్దాల క్రితం... ఐదువేల రూపాయలతో ఆయన ప్రయాణం మొదలైంది. రాకేశ్ మరణం తర్వాత కూడా, ఆయన నమ్మిన సిద్ధాంతం కాసులు కురిపిస్తూనే ఉంది. ఆ విలువ ఇప్పుడు, నలభైవేల కోట్ల పైమాటే. ఒకానొక సందర్భంలో, అంతర్జాతీయ పరిణామాల వల్ల ముడి ఇనుము ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో, ఇనుము-ఉక్కు కంపెనీల షేర్లు నేల చూపులు చూశాయి. మంద మనస్తత్వంతో మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. రాకేశ్ మాత్రం... ఆ గుంపులో కలవలేదు. నలుగురికీ భిన్నంగా ఆలోచించాడు. ధరల పతనం తాత్కాలికమని భావించాడు. తన దగ్గర ఉన్న సొమ్మంతా వెచ్చించి నాలుగు లక్షల షేర్లు కొన్నాడు. మార్కెట్ కోలుకోగానే, ఆ వాటాల విలువ అనూహ్యంగా పెరిగిపోయింది. ఓ అంచనా ప్రకారం... రెండు దశాబ్దాల క్రితం ఓ సగటు ఇన్వెస్టర్ 'కాంట్రరీ థింకింగ్' ఆధారంగా మార్కెట్‌లో లక్ష రూపాయలు మదుపు చేసి ఉంటే... అతని సంపద ఇప్పటికి ఇరవై ఎనిమిది లక్షలకు చేరుకునేది. అదే ఇండెక్స్ ఫండ్‌లో పెట్టి ఉంటే పద్దెనిమిది లక్షలకూ, మంద మనస్తత్వంతో వ్యవహరించి ఉంటే ఎనిమిది లక్షలకూ పరిమితం అయ్యేది.

కెరీర్ వేటలో...

స్వతంత్రమైన ఆలోచన... పట్టాలకు

నిత్య జీవితంలో...

'కాంట్రరీ థింకింగ్'ను నిత్య జీవితానికి కూడా అన్వయించుకోవచ్చు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు, 'ఇంతపెద్ద కష్టం వచ్చిందే?' అని బాధపడిపోతుంటారు చాలామంది. కానీ, 'నాకే ఎందుకొచ్చింది?' అనే కోణంలో ఆలోచించరు. 'కాంట్రరీ థింకర్లు' మాత్రమే ఆ వైపు దృష్టి సారిస్తారు. సమస్య మూలాల్ని పట్టుకోగలిగితే, పరిష్కారాల మూలాలూ దొరికిపోతాయి. కొత్త ఉద్యోగంలో చేరాలా, పాత కొలువులోనే కొనసాగాలా? కొత్తిల్లు కొనాలా, అద్దింట్లోనే ఉండాలా?... ఇలా ప్రతి ప్రశ్నకూ ఇక్కడ తిరుగులేని జవాబు లభిస్తుంది. ఏ ఎలక్ట్రానిక్ ఉపకరణాన్నో షాపింగ్ చేస్తున్నప్పుడు అందరిలా ఖరీదైన బ్రాండ్ల జోలికి వెళ్లకుండా, తక్కువ ధరలోనే నాణ్యమైన సరుకుల్ని అందించే కంపెనీల్ని ఎంచుకుంటారు. ఉద్వేగాలకు అతీతంగా ఎదుటి మనిషిని బేరీజు వేయడానికి కూడా ఈ ఆలోచనా విధానం ఉపయోగపడుతుంది. ఇదో మార్కెటింగ్ స్ట్రాటజీ కూడా. వ్యాపార ప్రచారానికీ, వ్యక్తిగత బ్రాండింగ్‌కూ పనికొస్తుంది. ప్రతి సినిమా విడుదలకు ముందూ చిత్ర యూనిట్ ఓ వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటుంది. ఆ ప్రకారంగానే, ప్రచారాన్ని హోరెత్తిస్తుంది. తాజాగా, బాలీవుడ్‌లో సంచలనాలు సృష్టించిన 'సయారా' చిత్ర పబ్లిసిటీ స్ట్రాటజీ ఏమిటో తెలుసా... అసలు పబ్లిసిటీనే ఇవ్వకపోవడం. 'కాంట్రరీ థింకింగ్'కు ఇదో ఉదాహరణ.



మించిన పెద్ద అర్హత, ఏ విద్యాసంస్థ సిలబస్‌లోనూ కనిపించని విలువైన పాఠం. కాలేజీ దశ నాటికే పిల్లలకు 'కాంట్రరీ థింకింగ్'ను అలవాటు చేయాలి. ఎవరో కంప్యూటర్ సైన్స్ తీసుకున్నారని, వాళ్లూ ఆ కోర్సును ఎంచుకోకూడదు. ఇంకెవరో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో అవకాశాలు బావుంటాయని చెప్పగానే అటువైపు మారిపోకూడదు. 'కాంట్రరీ థింకింగ్' ఎట్టి పరిస్థితుల్లోనూ మనల్ని మూకలో కలవనివ్వదు. 'నువ్వు ఎంత ప్రత్యేకమైన వ్యక్తివో, నువ్వు ఎంచుకునే మార్గమూ అంతే ప్రత్యేకంగా ఉండాలి' అని హెచ్చరిస్తుంది. కాబట్టే, తోటి విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల గురించి ఆలోచిస్తున్న సమయంలో... లారీపేజ్ గూగుల్‌ను ఆవిష్కరించాడు, జుకెర్‌బర్గ్ ఫేస్‌బుక్‌ను స్థాపించాడు. ఇద్దరికీ ఆ తెగువ 'కాంట్రరీ థింకింగ్'తో వచ్చిందే. ఆ ఆలోచనా విధానం... సరికొత్త దారిని ఎంచుకునే స్పష్టతను ప్రసాదిస్తుంది. ఆ బలంతోనే రితేష్ అగర్వాల్... మిత్రులు వద్దన్నా, కుటుంబం కాదన్నా దిల్లీలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ కామర్స్ నుంచి అర్ధంతరంగా బయటికి వచ్చేసి, 'ఓయో' కలను నిజం చేసుకున్నాడు. 'కాంట్రరీ థింకింగ్' ఎప్పుడూ మనల్ని సేఫ్‌జోన్‌కు బందీల్ని చేయదు. ప్రయోగాలను ప్రోత్సహిస్తుంది. సాహసాలకు ఉసిగొల్పుతుంది. ఏ కారణం వల్ల అయినా, ఇష్టంలేని ఉద్యోగంలో చేరినా... ఎంతోకాలం అక్కడ ఉండనివ్వదు. లక్షణమైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఉన్నతోద్యోగానికి రాజీనామా చేసి, ఆంగ్ల రచయితగా స్థిరపడాలన్న ఆనంద్ నీలకంఠన్ నిర్ణయం కూడా 'కాంట్రరీ థింకింగ్'కు ఉదాహరణే. ఈ విరుద్ధమైన ఆలోచనా శైలిని తాను పురాణాల్లోని రాక్షసుల నుంచి నేర్చుకున్నానని చెబుతారు ఆనంద్. రావణుడి నుంచి హిరణ్యకశిపుడి వరకూ... ఎవరికివారు మరణాన్ని జయించడానికి చేసిన ప్రయత్నాలు ఊహకు అందనివే. ఏ మహావిష్ణువో రంగంలోకి దిగేవరకూ వాళ్లదే పైచేయి. ఇదే ఇతివృత్తంతో 'అసురా వే... కాంట్రేరియన్ పాత్ టు సక్సెస్' అనే పుస్తకాన్ని తీసుకొచ్చారాయన.

పొరపాటున మరొకరి చొక్కా వేసుకున్నప్పుడు, చాలా చిరాకుగా అనిపిస్తుంది. ఉక్కపోతకు గురవుతాం. ఇంటికి రాగానే విప్పి పడేస్తాం. ఆ వస్త్రం ఎంత నాణ్యమైంది అయినా కావచ్చు, ఆ బ్రాండ్‌కు ఎంత పేరైనా ఉండొచ్చు. ఆ క్షణాన అవేవీ గుర్తుకురావు. మన అభిరుచుల్నీ, ఆసక్తుల్నీ పక్కనపెట్టి... ఎవర్నో అనుకరిస్తూ ఎంచుకునే కెరీర్ కూడా మనదికాని చొక్కా లాంటిదే. 'కాంట్రరీ థింకర్' ఎప్పుడూ ఆ తప్పు చేయడు. ఎవరినో అనుకరిస్తే అనుచరులుగానే మిగిలిపోతాం. ఎప్పటికీ నాయకులం కాలేం!

ఉద్యోగిగా...

ఏ యజమానీ ఉద్యోగి తనకు కార్బన్ కాపీలా ఉండాలని కోరుకోడు. తనకంటే భిన్నంగా ఆలోచించాలని ఆశిస్తాడు. ఎందుకంటే, అప్పటికే అతను ఓ వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించి ఉంటాడు. అంతకు మించి ఎదగడానికి పాత ఆలోచనలు పనికిరావు. కొత్త సరుకేదో కావాలి. అందుకే లక్షల జీతాలిచ్చి నిపుణుల్ని నియమించు కుంటాడు. కాంట్రరీ థింకర్స్‌ను ఇష్టపడతాడు. అనగనగా కథల్లో 'రాజుగారు అడిగే మూడు ప్రశ్నలకూ సరైన జవాబు చెప్పినవారికి... యువరాణిని ఇచ్చి పెళ్లి చేయడమే కాదు, అర్ధ రాజ్యాన్నీ రాసిస్తారు...' అంటూ మంత్రి సభాముఖంగా ప్రకటించేది, 'కాంట్రరీ థింకింగ్' మీద పట్టున్న పదునైన బుర్రల్ని వెతికిపట్టుకోడానికే. 'కాంట్రరీ థింకర్లు' పాల్గొనే సమావేశాల్లో వినూత్నమైన ఆలోచనలకు కొదవ ఉండదు, తిరుగులేని వ్యూహాలు శరవేగంగా ప్రాణం పోసుకుంటాయి. వాళ్లు స్వతహాగా మార్పు ప్రియులు కాబట్టి, పరిస్థితులకు తగినట్టు తమను తాము మార్చుకుంటారు. పొలిటికల్ స్ట్రాటజిస్టులుగా, మార్కెటింగ్ నిపుణులుగా, న్యాయవాదులుగా బాగా రాణిస్తారు.

ఒక దశలో, వ్యవసాయ రంగంలోని దళారుల బెడద ఐటీసీ లాంటి దిగ్గజాన్నీ భయపెట్టింది. ఓ సమావేశంలో 'ఈ సమస్యకు పరిష్కారమే లేదు' అనే నిర్ణయానికొచ్చారు పెద్దలంతా. అంతలోనే 'ఎందుకు లేదూ?' అంటూ ఓ స్వరం వినిపించింది. అతని పేరు శివకుమార్, మామూలు ఉద్యోగి. నేరుగా రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనగలిగితే, దళారుల జోక్యాన్ని తగ్గించవచ్చంటూ ఓ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాడు. అదే ఐటీసీ 'చౌపాల్' వ్యవస్థకు పునాది. ఆ సంస్థ పరివారంలోని మిగిలిన 35,449 మందిలో లేనిదీ, శివలో ఉన్నదీ ఒక్కటే... 'కాంట్రరీ థింకింగ్'.

షరా: 'కాంట్రరీ థింకింగ్' సర్వరోగ నివారిణి కాదు. దీని పరిమితులు దీనికి ఉన్నాయి. కొన్నిసార్లు మన ఆలోచన తప్పు కావచ్చు. ఆ వాదన హేతువు ముందు నిలబడకపోవచ్చు. ఆ సందర్భమే వస్తే, నిజాయతీగా ఓటమిని ఒప్పుకోవాలి. అంతేనా, 'ఇది... కాదు' అని చెప్పడంతోనే పనైపోదు. 'మరేది?' అనే స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యతా మనదే. ఎందుకంటే, 'కాంట్రరీ థింకింగ్' పిడివాదం కాదు... పదునైన ఆలోచనా విధానం! ★

‘నేను భగవంతుడిని నమ్మను... అసలు గుడికి ఎందుకు వెళ్లాలి... ఇన్ని హోమాలూ పూజలూ ఎందుకు చేస్తారో’... అంటూ ఒకప్పుడు ప్రతి విషయాన్నీ ప్రశ్నిస్తూ మొండిగా వాదించిన తానే ‘మహావతార్ నరసింహ’ లాంటి చిత్రాన్ని తీస్తానని ఎప్పుడూ ఊహించలేదంటాడు ఆ చిత్ర దర్శకుడు అశ్విన్‌కుమార్. మొదటి సినిమాతోనే హిట్టుకొట్టిన ఈ దర్శక నిర్మాత తన జీవితంలోని టర్నింగ్ పాయింట్‌నీ, సినిమా తీసే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లనీ చెప్పుకొస్తున్నాడిలా...





సినిమా కోసం అన్నీ అమ్మేశాం!

‘ఓ దేవుడి సినిమా తీయాలంటే మాటలా... పైగా యానిమేషన్‌లో. డబ్బు పోవడం తప్ప ఏమీ లేదు...’ అన్నవాళ్లలో కొందరు ఇవాళ నా దగ్గరకు వచ్చి భలే తీశారంటూ మెచ్చుకుంటున్నారు. నిజానికి ఈ సినిమా తీయాలనే ఆలోచన రావడం నుంచీ పూర్తి చేయడం వరకూ ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. చేసిన అప్పులకు లెక్కేలేదు. రాత్రింబవళ్లు అదే ధ్యాసగా గడిపాం. నలభైకోట్ల రూపాయల వరకూ పెట్టుబడి పెడితే ఈ రోజున దాదాపు 282 కోట్ల రూపాయల లాభాల్ని అందించి ఇంకా నడుస్తుండటంతో నేనూ, నా భార్య శిల్పా ధవన్ అయిదేళ్లుగా పడుతున్న కష్టాలన్నీ మర్చిపోయాం. మాది మహారాష్ట్రలోని థానే. చిత్రలేఖనం, డిజిటల్ పెయింటింగ్స్‌పైన ఉన్న ఇష్టంతో దిల్లీలో క్లీం పేరుతో వీఎఫ్‌ఎక్స్ స్టూడియో ప్రారంభించా. మెక్‌డొనాల్డ్స్, మారుతి, లెనొవొ, ఎరోస్ ఇంటర్నేషనల్, పిక్సియాన్ సంస్థలకోసం పనిచేశా. అయితే చదువుకుంటున్న రోజుల్లో నేను దేవుడిని నమ్మేవాడిని కాదు. దేవుడనేవాడే ఉంటే.. ఒకరికి సుఖం, మరొకరికి దుఃఖం ఎందుకిస్తాడని వాదించేవాడిని. అన్నింటినీ ప్రశ్నించేవాడిని. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవుగా. కొన్ని సమస్యలూ, ఒత్తిళ్లూ తప్పలేదు. సరిగ్గా ఆ సమయంలోనే కృష్ణభక్తుడైన శ్రీలప్రభుపాద రచనలూ, ఆ తర్వాత భగవద్గీతా చదవడం మొదలుపెట్టా. కృష్ణభక్తుడిగా మారా. అప్పుడే వీఎఫ్‌ఎక్స్ సామర్థ్యంతో త్రీడీలో ప్రహ్లాదుడు -నరసింహస్వామి కథను తీయాలనిపించింది. అలా దాదాపు అయిదేళ్ల క్రితం ‘మహావతార్-నరసింహ’ చిత్రానికి బీజం పడింది. నిజానికి ప్రారంభంలో ఈ సినిమా కోసం మా దగ్గరున్న డబ్బు సరిపోతుందనుకున్నాం. నేను వీఎఫ్‌ఎక్స్ వర్క్స్‌ద్వారా సంపాదించిన మొత్తం, పెళ్లికిముందు శిల్ప లండన్‌లో పనిచేసి ఆర్జించిన డబ్బూ చేతిలో ఉండటంతో పనులు మొదలుపెట్టాం. అయితే ఇందులోకి దిగాక బడ్జెట్ ఊహించనంత పెరిగి.. కోట్లు అవసర మయ్యాయి. ఇన్వెస్టర్లను వెతకాల్సి వచ్చింది.



అప్పులమీద అప్పులు

ఓ 2డీ కార్టూన్ చిత్రం ఉందనుకోండి... మనం ఒక్క క్షణంపాటు చూసే ఒక సీన్ కోసం 24 చిత్రాలు గీయాలి. అదే 3డీ యానిమేషన్‌లోనైతే... అలాంటి 24 ‘సెట్’లని సృష్టించాలి. ఆ ఒక్క సీన్‌కి కావాల్సిన 3డీ బొమ్మలూ, చుట్టూ ఉన్న వాతావరణం అన్నమాట. ఓ కంప్యూటర్‌లో ఆ సెట్ సృష్టించడానికి కనీసం వారం పడుతుంది. అలా కష్టపడి తీసిన ఓ ఐదు నిమిషాల సీన్ సరిగ్గా రాకపోతే మళ్లీ ‘రీ-షూట్’ చేయాలి! అది చేయడానికి మళ్లీ కొన్ని నెలలు తీసుకుంటుంది. ఈసారీ అంతే ఖర్చవుతుంది. ఓ ఆర్టిస్టుగా బొమ్మ వేసివ్వడం, తర్వాత దాన్ని గ్రాఫిక్స్‌లోకి మార్చడం, ప్రతి పాత్రనీ గమనించుకోవడం, హావభావాలు అనుకున్నట్లుగా వస్తున్నాయో లేదో చూసుకోవడం... ఇలా అన్నింటికోసం నేనూ, మా టీమ్ దాదాపు పదహారు గంటలు కష్టపడుతుంటే... నా భార్య శిల్ప ప్రతినెలా ఇరవయ్యో తారీఖు నుంచే సిబ్బందికి జీతాలు ఎలా ఇవ్వాలి, లోన్లు ఎలా తేవాలి, ఎవరిని అప్పు అడగాలి, వడ్డీలు ఎలా కట్టాలి... అని ఆలోచిస్తూ విపరీతంగా టెన్షన్‌పడేది. ఎందుకంటే... కొందరు పెట్టుబడి పెడతామని చివరి నిమిషంలో ఆగిపోయేవారు. అలా దాదాపు వంద మందికి పైగా ఇన్వెస్టర్లనూ, నిర్మాతల్నీ కలిశాం. ఓ వైపు ఆ ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు మా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను బయటకు తీశాం. అవన్నీ అయిపోయాక ఇష్టంగా కట్టుకున్న ఇంటిని తాకట్టుపెట్టాం. నగలు, కారు... ఇలా ఒక్కొక్కటిగా అన్నింటినీ అమ్మేయాల్సి వచ్చింది. అమ్మానాన్నలు ఇచ్చిన డబ్బూ సరిపోలేదు. చివరకు శిల్ప... తన పుట్టింటివాళ్ల సాయం కోరింది. ‘ఈసారి ఇన్వెస్టర్లు దొరికారు. ఈ ఒక్క నెల మాత్రమే సర్దండి. ఇదే ఆఖరుసారి. ఎలాగైనా తిరిగిచ్చేస్తాం’ అంటూ వాళ్లను బతిమాలడం ఎన్నోసార్లు విన్నాను.

భయపెట్టారు...

మా అవస్థలేవో మేం పడుతుంటే మరి కొందరేమో ‘దేవుడి సినిమా ఇక్కడ ఆడదు. సినిమా పోతే తర్వాత మీ పరిస్థితి ఏంటని భయపెట్టేవారు. నేనూ, నా భార్యా ఒకటే అనుకున్నాం... మా ప్రయత్నం ఒక విధంగా సాహసమే. అయినా కూడా సినిమా పోయినా మా ఖర్మవల్లే అలా అయ్యిందని అనుకోవాలనుకున్నాం. ఇక, వీఎఫ్‌ఎక్స్ పని ఎలాగూ తెలుసు. ఈ సినిమా ద్వారా మరికొన్ని నైపుణ్యాలు నేర్చుకున్నాం కాబట్టి మళ్లీ ఎప్పటిలా ఏదో ఒకటి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. అయితే, మా నమ్మకం వృథాపోలేదు. ముంబయికి చెందిన విద్యుదుత్పత్తి సంస్థ అపార్ గ్రూప్ వాళ్లు మాకు సహనిర్మాతలుగా మారడానికి ఒప్పుకున్నారు. అప్పటినుంచీ మా ఇబ్బందులు కాస్త తగ్గాయి. ఆ తర్వాత దీన్ని మార్కెట్ చేయడానికి కేజీఎఫ్, సలార్ చిత్రాల్ని నిర్మించిన హొంబలె సంస్థ ముందుకొచ్చింది. అలా బాలారిష్టాలన్నీ దాటుకుని జులై 25న రిలీజైన ‘మహావతార్ నరసింహ’ ఆబాలగోపాలాన్నీ కట్టిపడేసింది. మొదటి పదిరోజుల్లోనే వంద కోట్లు తెచ్చిపెట్టింది. ఇంకా ఆడుతూనే... ప్రస్తుతం దాదాపు 282 కోట్ల రూపాయలతో దేశంలో అత్యధిక వసూళ్లు రాబట్టిన యానిమేషన్ చిత్రంగా నిలిచిపోయింది! ★



హైదరాబాద్ 'ఇరానీ చాయ్' భలే ఉంటుంది, ముంబయి 'కటింగ్ చాయ్' రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే. రాజస్థానీ 'మసాలాచాయ్' ఒక్కసారి తాగితే ఎప్పటికీ గుర్తుండిపోతుంది... ఇలా, మనదేశంలో ఒక్కో ప్రాంతం ఒక్కో చాయ్‌కి ఫేమస్. వీటిని వీలుంటే వెళ్లినప్పుడు తాగుతాం. మరి అంతవరకూ ఆగలేని టీ లవర్స్ మాటేంటి? ఇంట్లోనే ఆ చాయ్‌లన్నీ సులభంగా చేసుకునేందుకు వీలుగా ఇప్పుడు స్పైస్ డ్రాప్స్ వచ్చేస్తున్నాయి. అవేంటో ఓసారి చూసేయండి...



టీ డ్రాప్స్ వచ్చేస్తున్నాయ్!





తెల్లారి లేచాక ముందు ఓ కప్పు స్ట్రాంగ్ టీ పడాల్సిందే. లేకపోతే... రోజంతా ఏదో కోల్పోయినట్టుగా ఉండేవాళ్లే ఎక్కువ. కాసింత టీపొడీ, పాలూ, పంచదారా వేసి చేసే సాధారణ టీలు మనకు తెలిసినవే! అంతకుమించి కాస్త స్ట్రాంగ్‌గా, మసాలా ఫ్లేవర్‌తో రోజుని మొదలుపెట్టాలనుకుంటే? ఇది కాస్త పనే... అల్లం దంచాలి, యాలకులు వేయాలి, ఆపైన బాగా మరిగించాలి. ఇంత చేసినా టీ దుకాణంలో దొరికే ఆ ప్రత్యేకమైన పరిమళం మనకి ఇంట్లో రాదు. అంత పనిలేకుండా, చిటికెలో టీకి వేర్వేరు రుచులూ, పరిమళాలూ తీసుకొచ్చే స్పైస్‌డ్రాప్స్ ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటిని ఒక్క చుక్క సాధారణ టీకి కలుపుకుంటే చాలు, కోరుకున్న పరిమళంతోపాటు ఆ టీ నుంచి అందే ఆరోగ్య ప్రయోజనాలూ అందుతాయి. ఉదాహరణకి కాశ్మీర్ ఖావానే తీసుకోండి... గ్రీన్ టీకి కుంకుమపువ్వూ, దాల్చినచెక్కా, యాలకులూ, బాదం పలుకులూ, గులాబీరేకులూ, ఇతర పరిమళ ద్రవ్యాలూ కలిపి దీనిని తయారుచేస్తారు. ఈ టీకి దేశవ్యాప్తంగా అభిమానులూ ఎక్కువే. దుకాణాల్లో మాత్రమే దొరికే ఈ టీని ఇంట్లో చేసుకోవడం అంటే అంత తేలిగ్గా అయ్యేపనేనా. కానీ ఒక్క చుక్క కాశ్మీర్ ఖావా డ్రాప్‌ని గ్రీన్‌టీలో వేసుకుంటే క్షణాల్లో రుచికరమైన ఖావా సిద్ధం. చిక్కనిపాలకి దాల్చినచెక్క, అల్లం, శొంఠి కలిపి చేసే హైదరాబాద్ ఇరానీ చాయ్ ఏమన్నా తక్కువ తిన్నదా! ఒక్కసారి తాగితే ఆ రుచి రోజుల తరబడి వెంటాడుతుంది. ఇవి మాత్రమే కాదు, ప్రత్యేక ఔషధాలు కలిసి చేసే కేరళ చాయ్, ముంబయి కటింగ్ చాయ్, రాజస్థాన్ మసాలా చాయ్, కోల్‌కతా స్ట్రీట్ చాయ్, పంజాబీ కడక్ చాయ్ వంటి రుచులతోపాటు... కుంకుమపువ్వూ, యాలకులూ, జాజికాయ, గులాబీరేకులు వంటివాటిని మేళవించి చేసిన మసాలా డ్రాప్స్ కూడా ప్రత్యేకంగా దొరుకుతున్నాయి. ఇవేమీ వద్దు ఒక్క యాలకుల పరిమళం చాలు, లేదంటే అల్లం ఒక్కటీ చాలు అనుకుంటే... అలా విడిగా కూడా లభ్యమవుతున్నాయి. యాలకులు, పుదీనా, కుంకుమ పువ్వు, లావెండర్, పెప్పర్‌మింట్, తులసి, చామంతి, మందార, రోజ్ రుచులను అందించే డ్రాప్స్‌లో నచ్చిన వాటిని ఎంచుకుని టీకి సరికొత్త రుచులూ, పరిమళాలూ, ప్రయోజనాలూ జోడించుకోవచ్చు.

ఒక్క చుక్క చాలు...

ఈ డ్రాప్స్‌ని వాడుకోవడం చాలా తేలిక. ఇంట్లో చేసుకున్న చాయ్‌కి ఒక్క చుక్క మసాలాడ్రాప్స్ కలుపుకుంటే మసాలా చాయ్ సిద్ధం. ఒక్కచుక్క సరిపోతుందా అని అనుమానిస్తున్నారేమో... 5ఎమ్.ఎల్ సీసా, 180 కప్పుల టీకి సరిపోతుంది. ఒక్క డ్రాప్ అంటే వంద గ్రాముల టీపొడికి సమానం అట. ఈ డ్రాప్స్‌తో ప్రత్యేకమైన రుచిని ఆస్వాదించడంతోపాటు టీని చేసుకునే సమయం కూడా కలిసి వస్తుంది. ఎక్కడికైనా తీసుకెళ్లడమూ తేలికే. ఒక చుక్కకే అంత రుచా... రసాయనాలు ఏమన్నా వాడతారేమో అనే సందేహం రావొచ్చు. కానీ వీటిని హైడ్రోసాల్స్ అంటారు. అంటే ఇవి కృత్రిమ రసాయనాలు వాడి చేసినవి కాదు... మొక్కల ఆకులూ, వేర్లూ, పూలూ, బెరడూ తదితరాలను వాడి ప్రత్యేక పద్ధతుల్లో వాటి సుగుణాలని ఆవిరి రూపంలో సేకరించి, వాటి నుంచి ఈ గాఢమైన ద్రావణాలని తయారుచేస్తున్నారు. ఇవి రెండేళ్ల వరకూ నిల్వ ఉంటాయి. పాలూ, పంచదారలు ఇష్టపడనివారు... హెర్బల్ టీలని సులభంగా తయారు చేసుకునేందుకు వీలుగా గ్రీన్ టీ, గ్రీన్ కాఫీ, బ్లాక్‌టీ, వైట్‌టీ వంటి రుచులను కూడా ఇలా ఎక్స్‌ట్రాక్ట్‌ల రూపంలో తయారుచేస్తున్నారు. మరి ఆలస్యం ఎందుకు, ఈ వాన చినుకుల్లో కోరిన రుచిలో వేడివేడి టీని తయారుచేసుకుని ఆస్వాదించేయండి! ★







గుడ్‌మార్నింగ్... ఏఐ టీచర్!



దగ్గరుండి హోంవర్క్ చేయిస్తుంది,
అర్థంకాని పాఠాల్ని విడమరిచి చెబుతుంది,
తప్పుగా చెబితే సరిదిద్దుతుంది,
కొత్త నైపుణ్యాల్ని నేర్పిస్తుంది,
పరీక్షలకు సంసిద్ధం చేస్తుంది,
మంచి నడవడిక నేర్పిస్తూ కథలూ చెబుతుంది...
ఒక్కమాటలో చెప్పాలంటే, గొప్ప విద్యార్థిగా
నిలిపేందుకు అన్ని విధాలుగా సాయపడుతూ టీచర్
అవతారమెత్తింది కృత్రిమ మేధ! బడి పిల్లల నుంచి
కాలేజీ విద్యార్థుల వరకూ ఈ 'ఏఐ టీచరమ్మ'
ఎలా ఉపయోగపడుతోందీ అంటే...
(సెప్టెంబరు 5 - ఉపాధ్యాయ దినోత్సవం)





తరగతిలో టీచర్ చెప్పిన పాఠం అర్థంకాకపోతే, ఇంటికొచ్చి అమ్మనో నాన్ననో అడిగేవాళ్లు. లేదంటే ట్యూషన్లో తెలుసుకునేవాళ్లు. అదీ కుదరకపోతే బడికి వెళ్లాక మరోసారి టీచర్‌ని అడిగి నేర్చుకునేవాళ్లు. ఒకవేళ భయపడో, మరేదైనా కారణంతోనో ఎవరినీ అడగకుండా ఉన్నారంటే మాత్రం ఆ సబ్జెక్టులో కాస్త వెనకబడిపోవడం ఖాయం... ఇది ఒకప్పటి మాట. విషయం ఏదైనా తెలియలేదా, ఎన్నిసార్లు విన్నా అర్థం కాలేదా... కంగారుపడకుండా ఏఐని అడిగితే సరి, అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినట్టుగా అవసరమైతే బొమ్మల రూపంలో క్లిష్టమైన పాఠాల్ని సైతం విడమరిచి చెబుతుంది. ఎలాంటి జంకూ లేకుండా ఏఐ టీచర్ సాయం తీసుకున్నారంటే చదువులో కచ్చితంగా ముందుకెళ్లొచ్చు... ఇది ఇప్పటి మాట. ఎందుకంటే అన్నింట్లో దూసుకుపోతున్న ఏఐ సాంకేతికత ఇప్పుడు విద్యార్థుల దగ్గరికీ వచ్చేసింది. పిల్లల అవసరాలకు తగ్గట్టు పాఠాలు చెబుతూ, సలహాలూ, సూచనలూ ఇస్తూ, ఎప్పుడూ వెన్నంటే ఉండే ఓ డిజిటల్ టీచర్ అయింది. అంగన్‌వాడీ స్కూళ్ల దగ్గర్నుంచి ఇంజినీరింగ్ కాలేజీల క్లాస్‌రూమ్స్ వరకూ అడుగులు వేస్తోంది కృత్రిమ మేధ.

పాఠాలు చెబుతుంది!

మ్యాథ్స్ అంటే ఒకరికి భయం. సైన్స్ పాఠాలు ఇంకొకరికి ఇష్టం ఉండదు. అందుకు ఒక కారణం ఆ సబ్జెక్టులు సరిగా అర్థంకాకపోవడమే. ఈ సమస్యను సులువుగా పరిష్కరిస్తూ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వచ్చాయి కొన్ని ఏఐ టూల్స్. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే 'ఏఐ సెర్చ్ ఇంజిన్, చాట్‌జీపీటీ, పర్‌ప్లెక్సిటీ'లు కాకుండా ఇంకా ఎన్నో యాప్స్ ఉన్నాయి. 'మైక్రోసాఫ్ట్ కోపైలట్'లో గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్... ఇలా ఏ సబ్జెక్టులో సందేహాలొచ్చినా అడగొచ్చు. తెలుగులో అడిగినా అది తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో చక్కగా వివరించి చెబుతుంది.

గూగుల్‌కు చెందిన 'జెమిని' టూల్‌తో హోంవర్క్ చేసుకోవచ్చు. అర్థం కాని ప్రాబ్లమ్స్‌ని అడిగి తెలుసుకోవచ్చు. ఉదాహరణకు ఏదైనా లెక్క ఎలా చేయాలో తెలియకపోతే ఫొటో తీసి జెమినిలో అప్‌లోడ్ చేస్తే చక్కగా దాన్ని చేసి చూపిస్తుంది. ఇంకా పాఠ్యపుస్తకాల్లోని పేజీల్నీ, నోట్స్‌నీ అప్‌లోడ్ చేస్తే... సులువుగా అర్థమయ్యేలా సారాంశాన్ని మాత్రమే అందిస్తుంది. ఇంటరాక్టివ్ క్విజ్‌ల ద్వారా కొత్త విషయాల్ని నేర్పిస్తుంది. టెక్స్ట్‌నీ, ఫొటోల్నీ షార్ట్ వీడియోల్లానూ చేసి పెడుతుంది. ఇందులోని డీప్ రిసెర్చ్ ద్వారా ఏ టాపిక్ గురించైనా పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు. వందలాది వెబ్‌సైట్లలోని విషయాన్ని సమగ్రంగా సేకరించి అందిస్తుంది. ఇలా విద్యార్థులకు ఉపయోగపడేలా రకరకాల టూల్స్‌తో వచ్చింది గూగుల్ జెమిని. విద్యార్థులకు ప్రత్యేకంగా ఏడాదిపాటు ఉచిత సేవల్ని అందుబాటులో ఉంచింది. సబ్జెక్టుల్ని బట్టి 'మ్యాథ్స్ ఏఐ, ఏఐ కెమిస్ట్రీ సాల్వర్'... తదితర యాప్స్‌లాంటివెన్నో వచ్చాయి. ఇంకా టీచర్ పాఠం చెబుతున్నప్పుడు టకటకా టెక్స్ట్‌గా రాసి చూపిస్తుంది 'ఓటర్ ఏఐ' యాప్. ప్రత్యేక సెమినార్లు ఉన్నప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.

భాష నేర్పిస్తుంది!



కమ్యూనికేషన్ స్కిల్స్‌కు అవసరమైన అంశాలలో ముఖ్యమైంది ఇంగ్లిష్. ఈ భాషలో ప్రావీణ్యం ఉంటే ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది. రాయడమూ, చదివేప్పుడు సరిగ్గా ఉచ్చరించడమూ, భయం లేకుండా మాట్లాడటమూ అన్నీ సరిగ్గా ఉండాల్సిందే. వీటన్నింటిలో పట్టు కావాలంటే ఇదివరకైతే ట్యూషన్లూ, ఆన్‌లైన్ తరగతులకి వెళ్లేవాళ్లు. కానీ కొంతమందికి అదీ కుదరదు. అలాంటి వాళ్లకు సాయంగానే కృత్రిమ మేధ ఇంగ్లిష్ టీచర్‌గా వచ్చింది. 'ఎల్సా ఏఐ'... పదాల ఉచ్చారణ, గ్రామర్, స్పీకింగ్ స్కిల్స్ నేర్పించే ఏఐ బెస్ట్ మొబైల్ యాప్ ఇది. యూజర్ల మాటలను రికార్డు చేసి డీప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ రికగ్నిషన్ సాయంతో వాటిని విశ్లేషిస్తుంది. పదాలూ, పదబంధాలను ఎలా వాడుతున్నామో వివరిస్తుంది. తప్పుగా మాట్లాడితే సరిచేసి ఫీడ్‌బ్యాక్ ఇస్తుంది. ఇది తెలుగు సహా 44 భాషల్లో వివరణలూ, ఫీడ్‌బ్యాక్ ఇవ్వగలదు. దీంట్లో రోజూ ప్రాక్టీస్ చేస్తూ భాషలో ఆరితేరొచ్చు. ఈ యాప్‌లో వేలకొద్దీ పాఠాలున్నాయి. విద్యార్థులతోపాటు జాబ్ ఇంటర్వ్యూలకు వెళ్లే వాళ్లకీ ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇంకా తప్పుల్లేకుండా ఏదైనా రాయాలంటే కాస్త భయపడుతుంటారు చాలామంది. 'గ్రామర్లీ' లాంటి ఏఐ సాఫ్ట్‌వేర్ తోడుంటే ఆ ఇబ్బందే ఉండదు. ఒక్కో వాక్యం రాసేటప్పుడే తప్పుల్లేకుండా దిద్ది పెడుతుంది. గ్రామర్, స్పెలింగ్స్‌ని సరి చేస్తూనే, మరింత బాగా రాయడానికి పదాల్ని సూచిస్తుంది కూడా. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఈ-మెయిల్స్ మొదలు వివిధ అసైన్‌మెంట్స్ వరకూ ఏదైనా తప్పులు లేకుండా రాసుకోవచ్చు. ఇలాంటి రకరకాల ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఏఐ యాప్స్‌తోపాటు స్పానిష్, ఫ్రెంచ్, కొరియా... లాంటి విదేశీ భాషల కోసం 'లింగోస్టార్.ఏఐ', 'స్పీక్'... లాంటి ఆప్షన్లనీ ప్రయత్నించొచ్చు.



ప్రణాళిక వేస్తుంది!

ఏ రోజుకారోజు తరగతిలో విన్న పాఠం చదువుకుంటే పరీక్షల సమయంలో ఇబ్బంది ఉండదు. అంటే దానికి ముందు నుంచే ప్రణాళిక వేసుకోవాలి. నోట్స్‌నీ సిద్ధం చేసుకోవాలి. అందుకు సాయం చేయడానికీ కొన్ని ఏఐ యాప్స్ ఉన్నాయి. అన్ని వయసుల విద్యార్థులకూ సరిపోయే ఈ యాప్‌ల వల్ల పేపర్, డైరీలతో పని లేకుండా వీటిల్లోనే అన్ని విషయాల్నీ భద్రపరుచుకోవచ్చు. హోంవర్క్ ఏం చేయాల్సి ఉందో రాసుకోవడంతోపాటు, పరీక్షల వివరాలూ, చదవాల్సిన సబ్జెక్టులతో చక్కగా టైం టేబుల్ చేసుకోవచ్చు. 'మైస్టడీలైఫ్' డిజిటల్ స్టడీ ప్లానర్ యాప్‌లో మన టైం టేబుల్ ప్రకారం గుర్తు చేసే రిమైండర్‌నీ పెట్టుకోవచ్చు. ఇంకా 'నోషన్ ఏఐ'లో క్లాస్ నోట్స్ రాయొచ్చు. 'స్టడీ స్మార్టర్'లో ఫ్లాష్‌కార్డ్‌గా ముఖ్యమైన విషయాల్ని నోట్ చేసుకోవచ్చు. సమయం దొరికినప్పుడల్లా దాన్ని చూస్తూ త్వరగా నేర్చుకోవచ్చు. స్నేహితులతో కలిసి బృంద చర్చలూ పెట్టుకోవచ్చు. మనం రోజూ చేసే పనులన్నింటినీ ఒక క్రమపద్ధతిలో ఓ మ్యాప్ వేసి అందిస్తుంది 'సింపుల్ మైండ్' యాప్. చదువుతో పాటు ఇతర పనుల్నీ హాయిగా చేసుకోవచ్చు. 'క్విజ్లెట్' యాప్‌లో ఏ అంశాన్నైనా చిన్న చిన్న పాయింట్ల రూపంలో వివరంగా నేర్చుకోవచ్చు. వాటన్నింటికీ సమాధానాలు చెప్పి మనకు ఆ సబ్జెక్టు మీద ఎంత అవగాహన ఉందో తెలుసుకోవచ్చు.



కథలు చెబుతుంది!

కథ అనేది పిల్లల్లో సృజనాత్మకత పెంచుతుంది, కొత్త విషయాన్ని నేర్పిస్తుంది, మంచిని బోధిస్తుంది. ఇలా ఒకటా రెండా... కథ అనేది పిల్లల నడవడికలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే అక్షరాల కన్నా ముందు, కథలతోనే ఎన్నో సంగతుల్ని చెబుతుంటారు టీచర్లు. ఇప్పుడాపనినీ చేయడానికి కృత్రిమ మేధ స్టోరీ టెల్లర్‌గా మారింది. వయసుల వారీగా వివిధ అంశాలతో కథలు చెప్పే ఏఐ యాప్స్ ఎన్నో ఉన్నాయి. 'బెడ్‌టైం స్టోరీస్ ఏఐ' ఆసక్తికరమైన నీతి కథలెన్నో చెబుతుంది. అందులో ఉన్నవే కాదు, చిన్నారులూ స్వయంగా కథను సృష్టించొచ్చు. 'స్టోరీబర్డ్', 'టేల్‌క్రాఫ్ట్' యాప్స్‌లో పిల్లలు తమ ఆలోచనలకు తగ్గట్టు చిన్న చిన్న పదాల్ని ఇచ్చారంటే- పూర్తి కథను రాసి ఇస్తాయవి. అందుకు తగ్గ బొమ్మల్నీ జత చేస్తాయి. రోజూ ఓ కొత్త కథ కావాలి అని కోరుకునే పిల్లలకు 'ఆస్కార్ స్టోరీస్' యాప్ నచ్చుతుంది. స్నేహం, దయ, నిజాయతీ... ఇలా రోజూ ఒక కొత్త విషయంతో చక్కని నీతి కథలు చెబుతుంది ఇది.



ఒత్తిడిలో అండవుతుంది!

పాఠాలు చెప్పడంలోనే కాదు, దిగులుగా ఉన్నప్పుడు గురువులా ప్రోత్సహించడంలోనూ, మానసిక స్థైర్యాన్ని అందించడంలోనూ 'ఏఐ మెంటర్'గా మారింది. 'ఫ్యాబులస్ యాప్' ప్రతి రోజూ ఒక మంచి మాట ద్వారా విద్యార్థుల్లో సానుకూల ఆలోచనల్ని పెంచుతుంది. మానసిక స్థితిని గుర్తించి ఒత్తిడిని తగ్గించడానికి సాయపడుతుంది 'వైసా' ఏఐ యాప్. మన బాగోగులు అడుగుతూనే, గొంతును బట్టి మూడ్‌ని గుర్తిస్తుంది. ఒత్తిడినీ, ఆందోళననూ పంచుకుంటే పాజిటివ్‌గా బదులు ఇస్తూ మనతో మాట్లాడుతుంది. ప్రతికూల ఆలోచనల నుంచి బయటపడ్డానికి సలహాలు ఇస్తూనే తగిన స్ట్రెస్ రిలీఫ్ వ్యాయామాల్నీ సూచిస్తుంది.

చదువు చెప్పడం దగ్గర్నుంచీ రకరకాల కోర్సులు నేర్పిస్తూ, ఇంటర్వ్యూ కోసం శిక్షణ ఇస్తూ ఉద్యోగంలో చేరేవరకూ అన్నింట్లో ఒక టీచర్‌గా, మంచి మెంటర్‌గా ఎన్నో విధాలుగా విద్యార్థులకు అండగా నిలుస్తోంది ఈ ఈతరం టీచర్- ఏఐ. ★

ఇది కొత్త బొప్పాయోచ్!






మనదేశానికి బొప్పాయి 16వ శతాబ్దంలో పోర్చుగీసుల ద్వారా పరిచయం అయింది. మొదట పెద్దగా ఇష్టపడకున్నా భారతీయ రైతు మెల్లగా దాన్ని తన సొంతం చేసుకున్నాడు. బొప్పాయి సాగులో భారతదేశాన్ని నంబర్ వన్‌గా నిలిపాడు! ఇంత చేసినా మన దగ్గర ఏడు దేశీయ వెరైటీలే ఉన్నాయి. వాటిల్లోనూ తేలికగా చీడపురుగుల దాడికి లోనయ్యేవే ఎక్కువ. అలాంటి సమస్యలేవీ అంటని, మరింత తియ్యని వెరైటీని ఆవిష్కరించాలనుకున్నాడు... పశ్చిమ్ బంగ హుగ్లీ జిల్లాకి చెందిన కృష్ణచందర్. ఆయనేమీ వ్యవసాయ శాస్త్రవేత్త కాదు... మామూలు రైతు. అదీ 72 ఏళ్ల వాడు. ఉన్నది కూడా ఎకరంన్నర పొలమే. అందులోనే తన దేశీయ బొప్పాయి రకాన్ని... 'రెడ్ లేడీ' అనే విదేశీ వెరైటీతో పరాగ సంపర్కం చేయించాడు. రెండేళ్లు ఎన్నో ప్రయోగాలూ వైఫల్యాలూ... తీవ్ర నష్టాల తర్వాత... చివరికి విజయాన్ని అందుకున్నాడు. కృష్ణచందర్ ఆవిష్కరించిన వెరైటీ మామూలు వాటికన్నా రుచికరంగా ఉండటమే కాదు... పెద్దగానూ ఉంటుంది. ఎలాంటి చీడపీడల్నయినా తట్టుకుని నిలవగలుగుతుంది. అందువల్లే 'కృష్ణచందర్ వెరైటీ'గా దీనికి కోల్‌కతా మార్కెట్‌లో విపరీతమైన గిరాకీ ఏర్పడింది. తన ఎకరంన్నర పొలంలోనే 7.5 టన్నుల బొప్పాయి పండిస్తూ... ఏటా 23 లక్షల రూపాయల ఆదాయం అందుకుంటున్నాడు కృష్ణచందర్!

'వయస్సుని జయించడం ఎలా..?' అనడిగితే 'చేసే పనిలో మమేకం కాగలిగితే, దాన్ని ఆస్వాదించగలిగితే, నిత్యం కొత్తగా ఆలోచిస్తూ ఉంటే జయించవచ్చు' అని అంటారు నేటి మేనేజ్‌మెంట్ గురువులు. ఆ మమేకం, అలాంటి ఆస్వాదన, వినూత్న ఆలోచన... వ్యవసాయ వృత్తిలోనూ సాధించవచ్చని నిరూపిస్తున్నారు ఈ ముగ్గురూ. అందువల్లే మిగతావాళ్లు 'కృష్ణా రామా' అని కూర్చునే వయస్సులోనూ సేద్యం చేస్తున్నారు. పండ్ల సాగులో కొత్త విప్లవాలే సృష్టిస్తున్నారు. మీరే చూడండి...

డ్రాగన్‌తో ప్రయోగాలు...

నాగరాజ్ నఖత్‌ది... పక్కా వ్యాపార కుటుంబం. అందుకే 1980ల్లోనే బీకామ్ చదివాడాయన. కానీ, ఓసారి బిహార్‌లోని తమ ఠాకూర్‌గంజ్ టౌనుని దాటి పల్లెటూళ్లకి వెళ్లడం ఆయన జీవితాన్ని మార్చేసింది. వ్యాపారాన్ని వదిలి వ్యవసాయదారుడయ్యాడు. ఆరంభంలో మిరప, ఉల్లి, జనుము వంటివి సాగు చేసినవాడు కాస్తా...



క్రమంగా అరటి సాగుపైన దృష్టిపెట్టాడు. ముఖ్యంగా సింగపూర్ వెరైటీలతో ప్రయోగాలు చేసి... వాళ్లుంటున్న కృష్ణగంజ్ జిల్లాని అరటి సాగులో నంబర్ వన్‌గా నిలిపాడు. పదేళ్లకిందట ఆయన దృష్టి డ్రాగన్ ఫ్రూట్‌పైన పడింది! పోషకాలు మెండుగా ఉన్న ఈ విదేశీ పండుని ఎలాగైనా బిహార్‌కి తేవాలనుకున్నాడు. తన ఏడెకరాల్లో వంద మొక్కల్ని



నాటితే దాదాపు అన్నీ ఎండిపోయాయి. కృషి విజ్ఞాన కేంద్రం సాయం కోరి... కొత్త ప్రయోగాలు చేశాడు. అవన్నీ ఫలించి 2019 నాటికి చక్కటి దిగుబడులు సాధించాడు. కృష్ణగంజ్ జిల్లాలోని మిగతా రైతులూ ఆయన బాట పట్టారు. 2020 నాటి కొవిడ్‌తో డ్రాగన్ పండుకి విపరీతమైన డిమాండు ఏర్పడటంతో... అందరూ లక్షల్లో లాభాలు చూశారు. నాగరాజ్ నఖత్ ప్రస్తుతం తన ఏడెకరాల్లో 20 వేల మొక్కల ద్వారా... 60 మెట్రిక్ టన్నుల డ్రాగన్ పండ్ల దిగుబడిని సాధిస్తున్నాడు. ఏటా రెండుకోట్ల రూపాయల దాకా ఆదాయం వస్తోంది నాగరాజ్‌కి. ఇంతకీ ఆయన వయసు ఎంతనుకున్నారు... 76 ఏళ్లు!

అరవైలు దాటినా... ఆగలేదు!

కశ్మీర్‌కి కివీ తెచ్చాడు!



కొత్తగా చూసేవాళ్లకి హిమాచల్‌ప్రదేశ్‌కీ జమ్మూ కశ్మీర్‌కీ పెద్ద తేడా ఉన్నట్టు అనిపించదు కానీ... రైతులకి ఆ వ్యత్యాసం బాగా తెలుసు. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో సాగవుతున్న వెరైటీ పండ్లు కశ్మీర్‌లో పండవు. పైగా... అక్కడివాళ్ల వ్యాపార నైపుణ్యం కశ్మీరీలకి రాదు. ఆ పరిస్థితిని మార్చాలనుకున్నాడు అరవై రెండేళ్ల మహ్మద్ అస్లాం భట్. మాజీ జవాను ఆయన. సైనిక సేవల నుంచి విశ్రాంతి తీసుకున్న తర్వాత పొలంబాట పట్టాడు. అందరిలాగే బియ్యం, గోధుమ, మొక్కజొన్నలు పండించసాగాడు. అప్పుడే ఓసారి హిమాచల్‌ప్రదేశ్‌కి వెళ్లి... కివీ పండ్ల సాగుని చూశాడు. వాటి పోషక విలువలూ, ఔషధ గుణాలూ... వాటితో వచ్చే లాభాలనీ విని వాటిని కశ్మీర్‌కీ తేవాలనుకున్నాడు. 2022లో తనకున్న నాలుగెకరాల్లోని రెండెకరాల పొలాన్ని ఇందుకోసం కేటాయించాడు. పూర్తిగా చేతులు కాల్చుకున్నాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా భారత హార్టికల్చర్ శాస్త్రవేత్తల సాయంతో... రకరకాల ప్రయోగాలు చేశాడు. ఎన్నో జాగ్రత్తలూ, కొత్తరకం నీటి సరఫరా పద్ధతులతో మూడేళ్ల తర్వాత అందులో విజయం సాధించాడు. కివీ సాగుని నాలుగెకరాలకి విస్తరించి... 21 లక్షల దాకా లాభాలు చూడసాగాడు. యువ రైతులూ ఆయన మార్గాన్నే అనుసరిస్తూ... ఉధమ్‌పూర్ జిల్లాని జమ్మూకశ్మీర్‌లో కివీకి కేరాఫ్‌గా మార్చారు!



సౌకర్యాన్నిస్తుంది, హుందాతనాన్నీ తెచ్చిపెడుతుంది. అందుకే... టీషర్టును మించింది లేదనేస్తారు సామాన్యుల నుంచి ప్రముఖుల వరకూ. మరి, అదే టీషర్టు త్రీడీ హంగుల్ని అద్దుకుని ఇంకాస్త ట్రెండీ లుక్కుతో వచ్చేసి మ్యాజిక్ చేస్తే ఎలా ఉంటుందంటారూ. వావ్, సూపర్ అంటూ వెంటనే కొనేస్తాం కదూ. ఈ టీషర్టులన్నీ అలా డిజైను చేసినవే మరి.







టీషర్టు... అదిరేట్టు!



ఇంట్లో ఉన్నప్పుడు మాత్రమే కాదండోయ్... చాలా సందర్భాలకు టీషర్టు మంచి ఛాయిస్ అనేస్తారు అన్నివయసుల వారూ. అందుకే సంవత్సరాలు గడుస్తున్నా, ఎన్ని ఫ్యాషన్లు వస్తున్నా... టీషర్టుకు ఉన్న క్రేజు పెరుగుతోందే తప్ప తగ్గడంలేదు. డిజైనర్లూ దీన్ని అర్థంచేసుకునే ఇందులోనూ ఎప్పటికప్పుడు నయా వెరైటీలను తీసుకొస్తూ ఫ్యాషన్ ఫాలోవర్లను ఆకట్టుకుంటున్నారు. అలా రూపుదిద్దుకున్నవే ఈ త్రీడీ గ్రాఫిక్ టీషర్టులు. నిజానికి టీషర్టులు ఒకప్పుడు కేవలం సాదాగా ఏదో ఒక రంగులో మాత్రమే వచ్చేవి. వీటికి ఆదరణ పెరిగాక కొటేషన్లూ, ప్రింట్లూ, గీతలూ, ఫొటోలతో... ఇలా కోరుకున్న డిజైన్లలో దొరకడం మొదలుపెట్టాయి. ఇవి ఎంత సౌకర్యాన్నిచ్చినా కూడా ఎప్పుడూ ఒకే మోడళ్లంటే అందరికీ నచ్చొద్దూ. అందుకే వాటికి కొత్తగా ఇలా త్రీడీ గ్రాఫిక్ హంగుల్ని అద్దారు. అన్ని వయసులవారూ మెచ్చే డిజైన్లలో తీసుకొచ్చేస్తున్నారు.



మాయ చేస్తాయి...

కొందరు క్రమం తప్పకుండా కసరత్తులు చేస్తారు. దాంతో చక్కని శరీరాకృతితోపాటు సిక్స్‌ప్యాక్ బాడీ కూడా సొంతమవుతుంది. కానీ, అలాంటి ఆకృతికోసం చాన్నాళ్లు కష్టపడాలనేది మాత్రం వాస్తవం. అంత శ్రమ లేకుండా సిక్స్‌ప్యాక్ బాడీతో కనిపిస్తూ కాస్త ఫోజు కొట్టాలనుకునే అబ్బాయిలూ ఉంటారుగా. అలాంటివారికోసమే ప్రత్యేకంగా 'మజిల్ ప్రింట్ టీషర్ట్స్' వస్తున్నాయి. వీటిని వేసుకుని బయటకు వెళ్తే చాలు... 'బ్రో! సిక్స్‌ప్యాక్ భలే ఉంది. ఏం వ్యాయామాలు చేశావు, డైటింగ్ సీక్రెట్ ఏంటీ...' అంటూ ఫ్రెండ్సంతా ప్రశ్నల వర్షం కురిపించడం ఖాయం. అదేవిధంగా అటు అమ్మాయిలూ, ఇటు అబ్బాయిలూ వేసుకునేలా వెరైటీ చిత్రాలనూ టీషర్టులపైన ఆవిష్కరించేస్తున్నారు. ఇందులో... సీతాకోకచిలుక, పూలతల మధ్య అందంగా నిల్చున్న సొగసరి, విసనకర్రను చేతపట్టుకున్న వయ్యారిభామ, ఓ పద్ధతిలో పేర్చిన పూల వరుస, అక్కడక్కడా అతికించినట్లుగా కనిపించే రంగురంగుల విరులు... చెప్పుకుంటూ పోతే బోలెడన్ని డిజైన్లు. లేదూ ఇంకాస్త సింపుల్‌గా ప్రకృతి అందాలు మాత్రం ఉంటే చాలనుకునేవారికోసం కొండాకోనల మధ్య నుంచి జాలువారే జలపాతాలను పోలిన ల్యాండ్‌స్కేప్ డిజైన్లనూ ప్రింట్ చేసి ఇస్తున్నారు. ఇంకా... టీషర్టుల్ని ఫార్మల్‌వేర్‌గా వేసుకోవాలనుకునే వారికోసం సూట్ లేదా జాకెట్, టైతో ఉన్నట్లుగా త్రీడీ ప్రింట్‌తో వస్తున్నాయి. అదేవిధంగా దారాలతో అల్లిన క్రోషె దుస్తులు బాగుంటాయి కానీ... పెద్దగా మన్నవనుకుంటారు కొందరు. అలాంటివారికోసమూ అచ్చంగా వులెన్ దారాలతో అల్లినట్లుగా కనిపించే క్రోషె డిజైను టీషర్టులు వచ్చేసి సందడిచేస్తున్నాయి. వీటన్నింటినీ త్రీడీ గ్రాఫిక్ రూపంలో డిజైను చేయడమే ఈ టీషర్టుల ప్రత్యేకత. దాంతో... దూరం నుంచి చూసినప్పుడు.. అరె! అలా ఎలా డిజైన్ చేశారబ్బా అని ఆశ్చర్యపోయినా... దగ్గరకు వెళ్తే కానీ తెలియదు అది ప్రింటు చేసిన మాయ అని. మరి, మీకు వీటిలో ఏ డిజైన్లు నచ్చాయి..? ★



అందమైన చీకటి

- డా॥ సన్నిహిత్

“అమ్మా, నా కొలీగ్ ప్రవీణ్ మ్యారేజ్ ప్రపోజల్ పెట్టాడు” నెమ్మదిగా చెప్పింది భూమి.

కూతురి వైపు విస్మయంగా చూసింది సరిత.

“అన్నీ తెలిసే ఈ ప్రపోజల్ పెట్టాడా?” అడిగింది సరిత.

“అవునమ్మా... పూర్తి బాధ్యత తీసుకుంటాను అన్నాడు” ఆశగా చెప్పింది భూమి.

చిన్నగా నవ్వింది సరిత. అభం శుభం తెలియని కూతురికి ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కాలేదు. మగవాడి మనస్తత్వం ఎప్పుడూ స్వార్థపూరితంగానే ఉంటుందని సరితకు జీవితానుభవం నేర్పింది. నెమ్మదిగా ఆమె మనసు గతంలోకి జారుకుంది.

★ ★ ★

పొద్దున్న ఆరు అయింది. రాత్రంతా పరుచుకున్న చీకటి ఆధిపత్యాన్నీ శాశ్వతత్వాన్నీ ఒప్పుకోను అన్నట్టు, వెలుగును నింపేస్తూ సూరీడు తూరుపు కొండల మాటు నుండి పైకి వచ్చేశాడు.

నిద్ర మత్తు వదిలి లోకం చైతన్యవంతం అవుతోంది.

“కాఫీ...” హాల్లో నుండి గట్టిగా అరుస్తున్న భర్త సుధీర్ అరుపు విని “ఆఁ... ఆఁ... తెస్తున్నానండీ” అంటూ కిచెన్‌లో నుండి బదులిచ్చింది సరిత. రెండు నిమిషాల్లో కాఫీ కప్పుతో హాల్లోకి వచ్చి భర్త చేతికి ఇచ్చింది.

“అబ్బా, ఎంతసేపు ఎదురుచూడాలి కాఫీ కోసం” అంటూ విసుక్కున్నాడు సుధీర్.

“బ్రేక్‌ఫాస్ట్ ప్రిపేర్ చేస్తున్నా... అందుకే స్టవ్ ఖాళీ లేక కాఫీ పెట్టడం లేట్ అయింది” సంజాయిషీ ఇచ్చింది సరిత.

“సరే... సరే... రెడీ అయి ఆఫీసుకి వెళ్ళాలి కదా నేను. లేట్ చేస్తే ఎలా” కాఫీ సిప్ చేస్తూ స్మార్ట్ ఫోన్‌లో వాట్సాప్ సందేశాలు చూడటంలో తలమునకలు అయ్యాడు.

ఇంతలో బెడ్‌రూమ్‌లో నుండి “మమ్మీ...” అని పిలిచింది ఆరేళ్ళ భూమి. గబగబా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి కూతుర్ని ఎత్తుకుని మంచం మీద నుండి దింపి బాత్‌రూమ్‌లోకి పంపింది. చిన్నప్పుడు ‘సెరెబ్రల్ పాల్సీ’ అటాక్ అవడంతో ఒక కాలు చచ్చుబడింది భూమికి. అందుకే సరిగ్గా నడవలేదు. ఎవరో ఒకరు కొంచెం సాయం చెయ్యాల్సి ఉంటుంది.

భూమి బాత్‌రూమ్‌లో నుండి వచ్చేటప్పటికి గ్లాసులో పాలు తెచ్చి తాగించింది. “స్కూల్‌కి తొందరగా రెడీ అవమ్మా... బ్రేక్‌ఫాస్ట్ తిందువుగానీ” అని చెప్పి మళ్ళీ కిచెన్‌లోకి వెళ్ళిపోయింది సరిత.

రోజూ పొద్దున్న నాలుగు గంటలకు లేస్తుంది సరిత. కాలకృత్యాలు తీర్చుకుని గుక్కెడు కాఫీ తాగి ఇంటి పనిలో పడుతుంది. ఇక అంతే... తొమ్మిదింటిదాకా ఊపిరి సలపని పని. ఇటు పుల్ల తీసి అటు పెట్టడు సుధీర్. పొద్దున్న లేవగానే కొంపలు మునిగిపోయినట్టు స్మార్ట్ ఫోన్‌లో ఫేస్‌బుక్, వాట్సాప్ చూస్తూ బిజీ అయిపోతాడు. ఎవరెవరికో గుడ్ మార్నింగ్‌లు చెబుతూ ఉంటాడు- పెళ్ళానికి తప్ప. మగ మహారాజు కదా... పైగా భర్త! అందుకే నోరెత్తదు సరిత.

కాసేపటికి “మమ్మీ... నేను రెడీ” అంటూ యూనిఫాం వేసుకుని వచ్చింది భూమి. తనకి జడలు వేసి, మొహానికి పౌడర్ రాసింది. ప్లేట్‌లో రెడీగా ఉన్న బ్రేక్‌ఫాస్ట్ తినిపించింది. సుధీర్ అప్పటికే డైనింగ్ టేబుల్ మీద సిద్ధంగా ఉన్న టిఫిన్ తింటున్నాడు. బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసి హెల్మెట్ తీసుకున్నాడు.


“భూమీ, తొందరగా రా...” అంటూ బయటకు వెళ్ళి బైక్ మీద కూర్చుని హారన్ కొడుతున్నాడు.

భూమి కాళ్ళకు షూస్ తొడిగి “పదమ్మా, డాడీ రెడీగా ఉన్నారు” అని స్కూల్ బ్యాగ్ తీసుకుని బయటకు వచ్చింది సరిత. భూమిని వెనక కూర్చోబెట్టుకుని బైక్‌ని రయ్యిన లాగించాడు సుధీర్. కూతుర్ని స్కూల్లో డ్రాప్ చేసి అటునుండి అటే ఆఫీసుకు వెళ్తాడు.

‘హమ్మయ్య...’ అని ఊపిరి పీల్చుకుని లోనికి పరుగెత్తింది సరిత. అయిదు నిమిషాల్లో స్నానం, టిఫిన్ తినడం కూడా పూర్తిచేసి రెడీ అయి, లంచ్ ప్యాక్ చేసుకుని, హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని బయటకు వచ్చి ఇంటికి తాళం పెట్టింది. స్కూటీ స్టార్ట్ చేసి హడావుడిగా ముందుకు ఉరికించింది.

★ ★ ★

బయో మెట్రిక్ పంచ్ కొట్టి ఆఫీసులోకి ఎంటర్ అయింది సరిత. ఎంత ప్రయత్నించినా ఆఫీసుకి ఇన్‌టైమ్‌లో రాలేకపోతోంది. ఈ రోజు పది నిమిషాలు



లేటు. చిన్నగా నిట్టూర్చి తన సీట్‌లోకి వెళ్ళి సెటిల్ అయింది. ఎదురుగా బాస్ క్యాబిన్‌లో నుంచి బయటకు వస్తున్న సుధీర్ కనిపించాడు. అతని మొహం నిండా సంతోషం తాండవిస్తోంది. పొద్దున్నే ఇన్‌టైమ్‌లో ఆఫీసుకు వచ్చి బాస్ క్యాబిన్‌లోకి వెళ్ళి గుడ్ మార్నింగ్ చెబుతాడు సుధీర్. ఆ రోజు చెయ్యబోయే వర్క్ గురించి బ్రీఫ్ చేస్తాడు. ఇలా చేస్తే బాస్ గుడ్ బుక్స్‌లో ఉంటామని అతని అభిప్రాయం.

నిజానికి సరిత, సుధీర్‌లు ఒకే ఆఫీసులో పని చేస్తారు. పెళ్ళికి ముందు సుధీర్-సరితను చూసి, ఇంప్రెస్ అయి ఆమెను పెళ్ళి చేసుకుందామని అనుకున్నాడు. ఒక శుభ ముహూర్తాన ప్రపోజ్ చేశాడు. అతన్ని కాదనడానికి సరితకు ఏ కారణమూ కనబడలేదు. 'ఓకే' చెప్పింది. పెళ్ళి వైభవంగా జరిగింది. అందరూ మంచి జంట అని పొగిడారు. ఒకే ఆఫీసులో పనిచేసే భాగస్వామి దొరకడం అందరికీ కుదిరే పని కాదనీ అదృష్టం అనీ భజన కొట్టారు. మురిసిపోయారు ఇద్దరూ. పెళ్ళి అయిన కొన్నాళ్ళకి అది నిజం కాదనీ వేరే సమస్యలు చాలా ఉంటాయనీ అర్థం అయింది. అయితే అన్ని సమస్యలనీ లైట్ తీసుకుని సంసార నౌకని ముందుకు సాగిస్తున్నారు.

మధ్యాహ్నం మూడు దాటింది. సరిత మనసు కూతురు భూమి మీదకు మళ్ళింది. మూడింటికి స్కూల్ అవగానే అక్కడికి దగ్గరే ఉన్న ఒక టీచర్ ఇంట్లో ట్యూషన్‌కి వెళుతుంది భూమి. సాయంత్రందాకా అక్కడ ఉండి తర్వాత ఆటోలో ఇంటికి వస్తుంది. ఆటో అతనికి నెలకు ఇంత అని పే చేస్తారు సరిత దంపతులు. భూమి ఇంటికి వచ్చే టైముకి ముందే సరిత ఇంటికి చేరుకుంటుంది. ఆమెకు స్నాక్స్ అవీ పెట్టి, కాసేపు ఆడుకోమని చెబుతుంది. తర్వాత హోమ్‌వర్క్ చేయిస్తుంది. సుధీర్ తీరిగ్గా ఆఫీసు నుండి బయలుదేరి లేటుగా ఇంటికి వస్తాడు. దానికి కారణం- అతను సాయంత్రం కూడా బాస్ క్యాబిన్‌కి వెళ్ళి మీటింగ్ పెడతాడు. ఆ రోజు జరిగిన వర్క్ ప్రోగ్రెస్ చెబుతాడు. బాస్‌తోపాటు టీ తాగి, అతన్ని అన్నివిధాలా సంతృప్తిపరచి అప్పుడు ఇంటికి వస్తాడు. ఇదీ రోజూ జరిగే తంతు.

సరిత తన వర్క్ ముగించి, గబగబా ఆఫీసు నుండి బయటపడి ఇంటి దారి పట్టింది. ఇంటికి చేరాక భూమి రాగానే, ఆమెను దగ్గరకు తీసుకుని స్కూల్ విషయాలు మాట్లాడుతూ రిఫ్రెష్ అయింది. స్నాక్స్ పెట్టి, అవి తిన్నాక హార్లిక్స్ కలిపి



ఇచ్చింది. కాసేపటికి భూమి ఆడుకోవడంలో పడింది. టీవీ ముందు కుర్చీలో వాలి నెమ్మదిగా టీ తాగుతూ రిలాక్స్ అవసాగింది సరిత.

తర్వాత ఎప్పటికో వచ్చాడు సుధీర్. భూమి "నాన్నా..." అంటూ ఏదో స్కూల్ విషయం చెప్పబోతుంటే "అబ్బ, అవన్నీ మీ అమ్మకు చెప్పు..." అని విసుక్కున్నాడు. చిన్న బుచ్చుకుంది భూమి. తర్వాత సరిత దగ్గరకు వచ్చి "ఈ రోజు మన బాస్ నన్ను ఎంత మెచ్చుకున్నాడో తెలుసా... ఈసారి నాకు ప్రమోషన్ గ్యారంటీ" అంటూ ఆ విషయాలన్నీ చెబుతున్నాడు. మౌనంగా వినసాగింది సరిత.

ఆమెకు పొద్దున్న ఆఫీసులో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చింది.

బాస్ ఆమెను క్యాబిన్‌కు పిలిచి "ఏంటి సరితా, రోజూ ఆఫీసుకు లేట్‌గా వస్తున్నావు. పని మీద కూడా శ్రద్ధ చూపడం లేదు. సాయంత్రం కాగానే బ్యాగ్ తీసుకుని పారిపోతావు. త్వరలో ప్రమోషన్ ఇంటర్వ్యూలు ఉంటాయి చూసుకో... ఇలా అయితే నిన్ను రికమెండ్ చెయ్యడం కష్టం" అని అక్షింతలు చల్లాడు. బయటకు వచ్చేస్తుంటే "అయినా సుధీర్ నీకు ఇవన్నీ చెప్పడా?" అని నవ్వసాగాడు. గుండె మండిపోయింది ఆమెకు. కంట్రోల్ చేసుకుని అక్కడి నుండి వచ్చేసింది.

ఇప్పుడు... తీరిగ్గా ఇంటికొచ్చి తియ్యగా మాట్లాడుతున్న సుధీర్ మీద అసహ్యం వేసింది.

భార్య కూడా తనతోపాటే జాబ్ చేస్తోందనీ ఆమె కూడా ఆఫీసు పనిమీద దృష్టి పెట్టి ప్రమోషన్ పొందాలి అనీ ఆమెకు ఆ అవకాశం ఇవ్వాలనీ... అతనికి ఎందుకు అనిపించదు? ఎందుకంటే అతనికి తన కెరీర్ ముఖ్యం. ఎవరు ఎలా పోయినా పర్వాలేదు. అంతే!

★ ★ ★

తర్వాతి రోజు... పొద్దున్న లేచేటప్పటికి, భూమికి ఒళ్ళు వేడిగా కాలిపోసాగింది. జ్వరం వచ్చిందని అర్థం అయింది సరితకు. సుధీర్‌తో "ఏమండీ... పాపకి జ్వరం వచ్చింది" అని ఆదుర్దాగా చెప్పింది.

"అవునా... ఇప్పుడెలా? నాకు ఇంపార్టెంట్ మీటింగ్ ఉంది కదా ఆఫీస్‌లో" అంటూ దిగులు నటించాడు.

చిన్నగా నవ్వింది సరిత. "సరే, నేను దాన్ని హాస్పిటల్‌కి తీసుకెళతాను... మీరు ఆఫీసుకు వెళ్ళండి" అని చెప్పింది.

"హమ్మయ్యా... థాంక్స్" అని చెప్పి ఆఫీసుకి పారిపోయాడు సుధీర్. భూమిని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి డాక్టర్‌కి చూపించి మందులు తీసుకుంది సరిత. ఆ రోజు భూమిని చూసుకుంటూ ఇంట్లోనే గడిపేసింది. సాయంత్రానికి భూమికి జ్వరం తగ్గింది. రిలీఫ్‌గా ఫీల్ అయింది సరిత. ఆఫీసు నుండి ఇంటికొచ్చిన సుధీర్ "ఈ రోజు మీటింగ్ చాలా బాగా జరిగింది తెలుసా... నాకు ప్రమోషన్ గ్యారంటీ ఈసారి" అని ఆనందపడిపోతున్నాడు.

"నాకు కూడా ప్రమోషన్ రావాలి కదండీ... ఇలా డుమ్మాలు కొడితే ఎవరిస్తారు నాకు ప్రమోషన్" నెమ్మదిగా అంది సరిత.

"అదేంటోయ్... నాకు ప్రమోషన్ వస్తే నీకు వచ్చినట్టు కాదా..." అంటూ నవ్వేశాడు సుధీర్.

"అది ఎలా..?" ఆశ్చర్యపోయింది సరిత.

"నువ్వు నా భార్యవు కదా... మనిద్దరిలో ఎవరికి వస్తే ఏంటి?" అంటూ కన్విన్స్ చేస్తున్నాడు సుధీర్.

నిజానికి అతను 'ఎవరికి వస్తే ఏంటి' అని పైకి చెప్పినా, ఒకవేళ అతనికి రాకుండా తనకు ప్రమోషన్ వస్తే తట్టుకోగలడా? పొద్దున పూట ఆఫీసుకు తనకంటే ముందు చేరుకోవాలని తనని వదిలేసి పరుగుపెడతాడు. కనీసం 'ఇద్దరం కలిసి వెళదాం' అని ఎప్పుడూ అనడు. అతని మేల్ ఇగోకీ భార్య ఆధిపత్యాన్ని సహించలేని మనస్తత్వానికీ ఇది పరాకాష్ఠ!

గాఢంగా నిశ్వసించి 'భర్త కోసం భార్య కెరీర్‌ని వదులుకోవాలన్నమాట... కుటుంబ బాధ్యతలకి ప్రయారిటీ ఇవ్వాలన్నమాట' అనుకుంటూ మౌనంగా మిగిలిపోయింది సరిత.

★ ★ ★

ఆఫీసులో 'విమెన్స్ డే' సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. విమెన్ ఎంప్లాయీస్ అందరూ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశమయ్యారు. స్నాక్స్ అవీ తిన్నాక స్పీచ్‌లు మొదలయ్యాయి. చీఫ్ గెస్ట్‌గా బాస్ భార్యను పిలిచారు. ఆమె ఆవేశంగా మైక్ తీసుకుంది. "స్త్రీకి సమానత్వం కావాలి. స్వాతంత్ర్యం కావాలి. ఆర్థిక భరోసా కావాలి. మనం దేనిలో తక్కువ? పిల్లల్ని కంటాం... ఇంటిని నడిపిస్తాం... ఉద్యోగాలు చేస్తాం... అన్నీ మనమే చూసుకుంటున్నాం. అందుకే ఎక్కడా తల వంచకూడదు మనం..." ఇలా దంచేస్తోంది ఆమె. ఇన్ని చెబుతున్న ఆమె భర్తకు లొంగి ఉంటుంది. సేవలు చేస్తుంది. అందుకే సరితకు నవ్వు వచ్చింది. తర్వాతి టర్న్ సరితది.

ఆమె మైక్ తీసుకుని "స్త్రీకి సమానత్వం, స్వాతంత్ర్యం తప్పకుండా కావాలి. వాటితోపాటూ 'ప్రేమ... బంధం' అనే వాటికి కూడా విలువ ఇవ్వాలి. కుటుంబ బాధ్యతల్ని ఒక బరువుగా, మన పురోగతికి ఆటంకంగా భావించకూడదు మనం" అని చెప్పి ముగించింది. అందరూ చప్పట్లు కొట్టి అభినందించారు. ఇంతలో సరిత సెల్ రింగ్ అయింది. అటునుండి వినబడిన మాటలు విన్నాక ఒక్కసారిగా టెన్షన్ ఫీల్ అయింది. చేతి వాచీలో టైము చూసుకుని... ప్రోగ్రాం మధ్యలోనే గబగబా ఆఫీసు బయటకు వచ్చేసింది. హడావుడిగా స్కూటీ స్టార్ట్ చేసి స్కూల్ వైపు దూకించింది. స్కూల్ బయట బిక్కుబిక్కుమని వెయిట్ చేస్తున్న భూమిని చూడగానే కన్నీళ్ళు వచ్చాయి సరితకు.

"అదేంటమ్మా... ఆటో అంకుల్ రాలేదా" ఆత్రుతగా అడిగింది సరిత.

"రాలేదమ్మా..." ఏడుస్తూ చెప్పింది భూమి. ఏదో కారణంతో సడన్‌గా హ్యాండ్ ఇచ్చాడు ఆటో డ్రైవర్. ట్యూషన్ టీచర్ ఫోన్ చేసి 'భూమి స్కూల్ నుండి ఇంకా ట్యూషన్‌కి రాలేదండీ... ఇంటికిగానీ వచ్చిందా?' అని అడగడంతో అనుమానం వచ్చి హడావుడిగా స్కూల్‌కి పరుగెత్తుకు వచ్చింది సరిత.

"సరే పదమ్మా..." అని భూమిని స్కూటీ మీద కూర్చోబెట్టుకుని ట్యూషన్ టీచర్ ఇంట్లో వదిలింది. తర్వాత ఆఫీసుకు వచ్చేసింది తిరిగి. అప్పటికి 'విమెన్స్ డే' ప్రోగ్రాం అయిపోయింది. ఆఫీసు టైము అయ్యాక పంచ్ కొట్టి భూమిని తీసుకుని ఇంటికి వచ్చేసింది సరిత.

సాయంత్రం తీరిగ్గా ఇంటికొచ్చిన సుధీర్, ఆటోవాడు స్కూల్‌కి రాలేదని తెలిసి అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. "రాస్కెల్... ఎంత పని చేశాడు... ముందుగా చెప్పాలి కదా" అంటూ వీరంగం వేస్తున్నాడు.

భార్య దగ్గరకు వచ్చి "నీకు ఈ రోజు 'విమెన్స్ డే సెలెబ్రేషన్' ఉంది కదా...



ఎందుకు ఆఫీసు నుండి మధ్యలో వచ్చేశావు. పైగా బాస్ భార్య అక్కడే ఉంది... ఏమనుకుంటుంది? నాకు చెబితే స్కూల్‌కి వెళ్ళేవాడిని కదా" గట్టిగా అన్నాడు.

సరిత చిన్నగా నవ్వి "మీకెందుకండీ అంత శ్రమ... మీరు ఆఫీసులో బాగా పనిచేయండి. బాస్ గుడ్ లుక్స్‌లో ఉండి ముందు ప్రమోషన్ తెచ్చుకోండి... నేను ఉన్నాను కదా ఇలాంటి చిన్న చిన్న విషయాలు చూసుకోవడానికి" అంది.

"అదేంటి... అలా అంటావు?" అసహనంగా మొహం పెట్టాడు సుధీర్.

"అలాగే అంటాను. ఎందుకంటే నేను మీకు 'భార్యను' మాత్రమే కాదు... భూమికి 'అమ్మను' కూడా కాబట్టి. నవ మాసాలూ మోసి దాన్ని కన్నాను కాబట్టి. దానికి ఏదైనా జరిగితే తట్టుకోలేను కాబట్టి" అంది ఆవేశంగా.

"అంటే నాకు ఏ బాధా లేదంటావా?" కోపంగా అన్నాడు సుధీర్.

"అవును. ఆఫీసులో నేను కూడా మీతోపాటే పని చేస్తున్నాను. మీరు ప్రమోషన్ కోసం బాస్‌ని ఇంప్రెస్ చేయడానికి అన్ని పాట్లు పడతారు. కానీ నేను మాత్రం కనీసం నా వర్క్ నేను చేసుకుంటూ కూడా బాస్ దృష్టిలో పడకూడదు. కెరీర్‌ని త్యాగం చేసి కుటుంబాన్ని నడిపించాలి. ఆఫీసుకి మీకంటే లేట్‌గా వెళ్ళాలి. మీకంటే ముందుగా ఇంటికి వచ్చెయ్యాలి. మీ అహం సంతృప్తిపరచడానికి కెరీర్‌లో మీకంటే తక్కువ స్థాయిలో ఉండాలి నేను. అప్పుడే మీకు మనశ్శాంతి. ఎందుకంటే నేను మీ చాటున బతికే ఆడదాన్ని కదా" స్థిరంగా చెప్పింది సరిత.

"నీకు నా చాటున బతకడం అంత ఇబ్బంది అయితే- కుటుంబాన్ని కాదని కెరీర్‌లో ఎదుగుదలా స్వేచ్ఛా మాత్రమే కోరుకుంటే ఒక్కదానివీ బతికేంత దమ్ము ఉంటే... నన్ను వదిలి వెళ్ళిపో... ఒంటరిగా బతికి చూడు" కోపంగా అన్నాడు సుధీర్.

"అవునా... ఒకవైపు ఉద్యోగాన్నీ ఇంకోవైపు కుటుంబాన్నీ ఒంటి చేత్తో నెట్టుకొస్తున్న నేను అది మాత్రం చెయ్యలేనా... సరే వెళ్తున్నాను... గుడ్ బై" అని చెప్పి భూమిని తనతో తీసుకుని ఆ ఇంట్లో నుండి వచ్చేసింది సరిత.

షాక్ తగిలినట్టు అలా చూస్తూ ఉండిపోయాడు సుధీర్. తర్వాత వాళ్ళెప్పుడూ కలవలేదు. కాలం గిర్రున తిరిగిపోయింది.

భూమి పెరిగి పెద్దదై జాబ్ తెచ్చుకుంది. ఇప్పుడు పెళ్ళీడుకొచ్చి తగిన లైఫ్ పార్ట్‌నర్‌ని వెతుక్కుంది. ఆ విషయాన్ని తల్లితో ధైర్యంగా చెప్పగలిగింది కూడా.

★ ★ ★

చెంపల పైకి కన్నీరు జారడంతో గతంలో నుండి బయటపడింది సరిత.

కూతుర్ని చూస్తూ "భర్త తోడు లేకుండా... అసలు ఎవరి తోడూ లేకుండా... సింగిల్ మదర్‌గా ఉంటూ నిన్ను పెంచి పెద్ద చేయడానికి ఎంత కష్టపడ్డానో, కాకుల్లా పొడిచే ఈ సమాజాన్ని ఎలా ఎదుర్కొన్నానో నీకు తెలుసు కదా భూమీ. మన చుట్టూ ముసురుకున్న చీకటి మనల్ని భయపెడుతుంది. కానీ కొంచెం ధైర్యం చూపితే అదే చీకటి అందంగా కనిపిస్తుంది. మనకు అండగా నిలబడుతుంది. నువ్వు కూడా పెద్దదానివయ్యావు. లోకాన్ని చూశావు. నీకు ఇంకా ఏం చెప్పగలను? ఏది మంచో ఏది చెడో... ఎలా చేస్తే నీకు మంచిదో... నువ్వే నిర్ణయించుకో తల్లీ" చెప్పింది సరిత.

"అలాగే అమ్మా..." అంటూ తల్లి చేతిని గట్టిగా పట్టుకుని నవ్వేసింది భూమి. సంతృప్తిగా చూసింది సరిత. ★

చారు రుచి... అదరహో!

మటన్ కూరకి మిరియాల చారుని మించిన కాంబినేషన్ మరొకటి ఉండదేమో! జలుబు చేసినప్పుడు అల్లం చారు తగిలితే నోటికి అంతకు మించిన రుచి ఉండదేమో. ఊరించే కూరలెన్నున్నా, చారుతోనే భోజనానికి నిండుదనం అనే వారి కోసమే ఈ చారు రుచులు...

మిరియాల చారు



కావలసినవి: మిరియాలు: చెంచా, వెల్లుల్లి రెబ్బలు: పది, జీలకర్ర: చెంచా, చింతపండు: నిమ్మకాయంత, టొమాటో: ఒకటి, నూనె: చెంచా, పసుపు: పావుచెంచా, ఎండుమిర్చి: మూడు, ఆవాలు: పావుచెంచా, కరివేపాకు: రెండు రెబ్బలు, కొత్తిమీర తురుము: రెండు చెంచాలు, ఉప్పు: తగినంత, ఇంగువ: పావుచెంచా.

తయారీ విధానం: మిరియాలు, వెల్లుల్లి రెబ్బలు, జీలకర్ర... వీటిని మరీమెత్తగా కాకుండా కచ్చాపచ్చాగా దంచుకోవాలి. చింతపండుని అరలీటర్ నీళ్లలో నానబెట్టుకోవాలి. స్టవ్ వెలిగించి దళసరి గిన్నెలో నూనె వేసుకోవాలి. వేడెక్కాక ఆవాలు, పసుపు, ఎండుమిర్చి వేయించి టొమాటో ముక్కలు వేసి మెత్తగా మగ్గనివ్వాలి. ఇందులో చింతపండు రసం వేసి మరుగుతున్నప్పుడు దంచి పెట్టుకున్న మిరియాలు-వెల్లుల్లి మిశ్రమాన్ని కూడా వేయాలి. ఉప్పు, కరివేపాకు, కొత్తిమీర, ఇంగువ వేసి బాగా మరగనిస్తే ఘాటైన మిరియాల చారు సిద్ధం.



అల్లం చారు

కావలసినవి: కందిపప్పు: మూడు చెంచాలు, కరివేపాకు రెబ్బలు: రెండు, పసుపు: పావుచెంచా, టొమాటో: ఒకటి, మిరియాలు: చెంచా, అల్లం: అంగుళమంత ముక్క, వెల్లుల్లి రెబ్బలు: ఆరు, జీలకర్ర: చెంచా, దనియాలు: అరచెంచా, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు, నిమ్మరసం: మూడు చెంచాలు, ఉప్పు: తగినంత.

తాలింపుకోసం: నూనె: చెంచా, ఆవాలు: అరచెంచా, మెంతులు: పావుచెంచా, ఎండుమిర్చి: రెండు, ఇంగువ: చిటికెడు, కరివేపాకు: రెండు రెబ్బలు.

తయారీ విధానం: కందిపప్పుని అరగంట ముందే నానబెట్టి ఉంచుకోవాలి. కుక్కర్‌లో కందిపప్పు, పసుపు, కరివేపాకు రెబ్బలు, టొమాటో వేసి తగినన్ని నీళ్లుపోసి నాలుగైదు విజిల్స్ రానిచ్చి మెత్తగా ఉడికించుకోవాలి. ఆ పప్పుకి అరలీటర్ నీళ్లను కలిపి వడకట్టి... పలుచటి పప్పు నీళ్లని మాత్రమే తీసుకోవాలి. మిరియాలు, జీలకర్ర, వెల్లుల్లి, అల్లం, దనియాల్ని కచ్చాపచ్చాగా మిక్సీ పట్టుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి పప్పు నీళ్లను సన్నమంటపైన ఉంచి, అందులో తగినంత ఉప్పు, మిక్సీ పట్టుకున్న మిరియాలు-అల్లం మిశ్రమాన్ని వేసుకుని ఒక్క పొంగు రానివ్వాలి. స్టవ్ కట్టేసి నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసుకోవాలి. చివరగా తాలింపు వేసుకుని ఆ తాలింపు గింజలని ఈ రసంలో కలుపుకుంటే అల్లం- నిమ్మకాయ చారు సిద్ధం.

పుదీనాతో...



కావలసినవి: పుదీనా: అరకప్పు, చింత పండు గుజ్జు: రెండు చెంచాలు, కందిపప్పు ఉడికించిన నీళ్లు: అరకప్పు, టొమాటో: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, పసుపు: పావుచెంచా, రసం పొడి: ఒకటిన్నర చెంచా, ఇంగువ: చిటికెడు.

తాలింపుకోసం: నెయ్యి: చెంచా, ఆవాలు: అరచెంచా, జీలకర్ర: అరచెంచా, ఇంగువ: పావుచెంచా, ఉప్పు: తగినంత, ఎండుమిర్చి: రెండు.

తయారీ విధానం: పుదీనాలో కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. చింతపండు గుజ్జుని అరకప్పు నీళ్లలో కలిపి సిద్ధం చేసుకోవాలి. స్టవ్ వెలిగించి దళసరి పాత్రలో చింతపండు రసం వేసుకోవాలి. దానిలో టొమాటో ముక్కలని చేత్తోనే మెత్తగా చిదిమేసి వేయాలి. ఆపైన మిక్సీ పట్టిన పుదీనా పేస్ట్, పసుపు, పచ్చిమిర్చి, రసం పొడి, ఉప్పు, ఇంగువ, తగినన్ని నీళ్లు పోసి ఒక్క పొంగు రానివ్వాలి. కందిపప్పు ఉడికించిన నీళ్లు కూడా పోసుకుని బాగా మరిగిన తర్వాత నెయ్యి తాలింపు వేసుకుంటే ఘుమఘుమలాడే పుదీనాచారు సిద్ధం.

మంగళూరు చేపల కూరంటే ఇష్టం



- ఐశ్వర్యరాయ్

నేను పుట్టి పెరిగిందంతా మంగళూరులోనే. అక్కడ కొబ్బరిపాలతో చేసే మంగళూరు స్టైల్ చేపలకూరంటే ఇష్టం నాకు. వేడివేడి అన్నంలో అమ్మవండిన చేపలకూర వేసుకుని తింటుంటే అమృతమే. మా అమ్మ దగ్గర నుంచి ఇష్టంగా నేర్చుకున్న వంటల జాబితాలో ఇదే ముందుంటుంది. ఈ కూరని చాలా రకాల చేపలతో చేసినా నాకు మాత్రం రవ్వ చేపలతో చేస్తేనే ఇష్టం. అందుకే ఇంట్లో వీలు కుదిరినప్పుడల్లా వండేస్తుంటా. అరకేజీ రవ్వ చేపలకి, ముప్పావుకప్పు కొబ్బరిపాలు, ఒక ఉల్లిపాయ, మూడు పచ్చిమిర్చి సరిపోతాయి. చేపలకి పసుపు, ఉప్పురాసి పక్కన పెట్టుకోవాలి. దళసరి కడాయిలో నూనె వేసుకుని ఉల్లిపాయముక్కలూ, పచ్చిమిర్చి వేసి ఎర్రగా వేయించుకోవాలి. చెంచా కారం, చెంచా దనియాలపొడి, పసుపు, ఉప్పు, రెండు చెంచాల చింతపండు గుజ్జు వేసుకుని అన్నింటినీ కలపాలి. ఆ తర్వాత కొబ్బరిపాలు, కప్పునీళ్లు పోసి మరిగించుకుని అందులో మారినేట్ చేసిన చేపలని వేసుకుని ఐదునిమిషాలు ఉడికిస్తే చేపల కూర రెడీ!


సెలబ్రిటీ స్పెషల్



సిసింద్రీ

అవి ఏవి?

ఇక్కడున్న బొమ్మల్లో రెండు మాత్రమే ఒకేలా ఉన్నాయి. ఆ రెండూ ఏవో చెప్పగలరా?




కనిపెట్టగలరా?

అక్కాచెల్లెళ్లు ఎంచక్కా తమ గదిని శుభ్రం చేసుకుంటున్నారు కదూ! ఈ బొమ్మలో ఆంగ్ల అక్షరం 'C'తో ప్రారంభమయ్యే అంశాలు కొన్ని ఉన్నాయి. అవేంటో కనిపెట్టగలరా?



దారి కనుక్కోండి

ఇక్కడున్న నలుగురు పిల్లలకూ నాలుగు రకాల స్నాక్స్ అంటే ఇష్టం. మరి ఎవరికి ఏది ఇష్టమో చెప్పండి చూద్దాం.



ఎక్కడబ్బా?



పైనున్న బొకేల వరస- కింది వాటిల్లో అడ్డం, నిలువుల్లో మూడుసార్లు కనిపిస్తుంది. ఎక్కడెక్కడున్నాయో వెతికి పట్టుకోండి మరి!




తేడాలేంటి?

ఈ కింది బొమ్మల్లో ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?




పోలికలేంటి?

ఈ బొమ్మల్లో అడ్డం, నిలువ, ఐమూలగా ఉన్నవాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో చెప్పగలరా?



జత ఏది?

చింటూ ఆడుకుంటూ ఇంట్లోని వర్డ్ బ్లాక్స్‌ను కింద పడేయడంతో అవి ముక్కలయ్యాయి. అయితే, వాటిలో సరైన జతలను మీరు గుర్తించగలరా?



యుక్తి-శక్తి

తాతయ్య వచ్చేసరికి టీవీ చూస్తున్నాడు చిన్నా. 'ఏరా.. నీకు రేపు పరీక్ష ఉంది కదా?' అని అడిగారాయన. 'పుస్తకంలోని ప్రతిదీ చదవడం ఎందుకు తాతయ్యా.. ముఖ్యమైన పాఠాలు మాత్రమే నేర్చుకున్నాను. గతేడాది అలాగే పాసయ్యాను' అంటూ బదులిచ్చాడు చిన్నా. 'కూతలు నేర్చిన వేటగాడిలా ఉందిరా నీ సంగతి' అన్నారు తాతయ్య. 'వేటగాడెవరు.. ఆ కథేంటి?' ఆసక్తిగా అడిగాడు చిన్నా. 'చెప్తా విను' అంటూ ఆ కథ చెప్పడం ప్రారంభించారు తాతయ్య. ఓ వేటగాడికి వేటలో నైపుణ్యం లేకపోయినా.. జంతువుల అరుపులన్నీ అరవడంలో మాత్రం నేర్పు ఉంది. ఆ నేర్పుతో



జింకలుండే చోటకెళ్లి జింకలా అరిచేవాడు. అది నిజమనుకొని మిగిలిన జింకలన్నీ వేటగాడు దాక్కున్న దగ్గరకు వచ్చేవి. అప్పుడు సులువుగా వాటిని వేటాడేవాడు. ప్రాణాలు కాపాడుకునేందుకూ అదే యుక్తిని వాడేవాడు. ఎలాగంటే... ఒక్కోసారి ఆ జింక అరుపులు విని.. తోడేళ్లూ వచ్చేవి. అప్పుడు పులిలా గాండ్రించేవాడు. దాంతో తోడేళ్లు పారిపోయేవి. యుక్తికీ, శక్తికీ తేడా తెలియకుండా.. తనంత గొప్ప వేటగాడే లేడని విర్రవీగేవాడు. ఓరోజు ఏమైందంటే.. పొదలో దాక్కుని జింకలా అరిచేసరికి, తోడేలు అటుగా వచ్చింది. దాన్ని చూసి భయంతో పులిలా గాండ్రించాడు. ఆ తోడేలు పారిపోయింది కానీ, మరో పులి అటుగా రాసాగింది. దాన్ని భయపెట్టేందుకు ఎలుగుబంటిలా అరిచాడు. అది విని పులి వెనక్కి వెళ్లిపోయినా, మరో వైపు నుంచి రెండు ఎలుగుబంట్లు వచ్చాయి. వాటిని భయపెట్టడానికి ఎలా అరవాలో తెలియలేదా వేటగాడికి. పారిపోయేలోగా అతడిపైన దాడి చేశాయవి. నిజంగా వేటాడే శక్తే తనకుంటే ధైర్యంగా ఎదిరించేవాడు కానీ తప్పించుకునేందుకు యుక్తులు పన్నేవాడు కాదంటూ కథ ముగించారు తాతయ్య. అదంతా శ్రద్ధగా విన్న చిన్నా.. 'ఇక నుంచి నేను కూడా యుక్తిని మాత్రమే కాకుండా శక్తినీ నమ్ముకుంటా. పాఠాలన్నీ చదువుతా' అనడంతో ప్రేమగా తనను దగ్గరకు తీసుకున్నారు తాతయ్య.

రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. ఐస్‌క్రీమ్ బండికున్న కర్ర 2. కుడి చివరనున్న సీతాకోకచిలుక 3. పాప జుట్టు 4. ఐస్‌క్రీమ్ అమ్మే వ్యక్తి డ్రెస్ 5. బాబు వెనుకనున్న వ్యక్తి చెయ్యి 6. కుక్క నోటిలో ఎముక 7. బెలూన్ రంగు 8. బస్సు దిశ.

జత ఏది?: 1-8 (SHEEP), 2-3 (TIGER), 4-7 (HORSE), 5-6 (ZEBRA).


దారి కనుక్కోండి: 1-D, 2-A, 3-B, 4-C.

పోలికలేంటి?: అడ్డం: కొబ్బరిబోండాం, డైరీ, బైనాక్యులర్స్; నిలువు: క్రేయాన్స్, రూటర్, బ్లూటూత్ స్పీకర్; ఐమూల: క్యారెట్లు, స్విచ్ బోర్డు.

అవి ఏవి?: 4, 8

కనిపెట్టగలరా?: Computer, Coat, Car, Clouds, Cat, Clock, Corn, Carrots.


ఎక్కడబ్బా?:



సమీక్ష

రమణ తత్వం


'నువ్వెవరు?'... రమణులవారిని ఎవరు ఏ ప్రశ్న అడిగినా, చాలాసార్లు ఇదే ప్రశ్న జవాబుగా వచ్చేదంటారు. నిజమే, మనం ఎవరమన్నది తెలుసుకోగలిగితే.... చాలా ప్రశ్నలు మాయమైపోతాయి. అదే రమణతత్వం! ఎం.వి.ఆర్.శాస్త్రి 'కరుణాచల రమణ' ఆంధ్ర, ఆంగ్ల, తమిళ భాషల్లో ఇప్పటికే వచ్చిన రమణ సాహిత్యానికి చిక్కని సారంలా అనిపిస్తుంది. అద్వైత రమణుల అవతార పరిసమాప్తి సమయంలో ఆకాశంలో కనిపించిన కాంతిపుంజంతో ఆరంభించి.... శాశ్వత సమాధి స్థితికి చేరే వరకూ అనేకానేక విషయాలను ప్రస్తావించారు. అవన్నీ చదువుతూ మనమూ మానసికంగా తిరువణ్ణామలై వెళ్లిపోతాం, రమణాశ్రమంలో కూర్చుని ధ్యానం చేసుకుంటాం.



కరుణాచల రమణ; రచన: ఎం.వి.ఆర్.శాస్త్రి
పేజీలు: 168, వెల: రూ.200; ప్రతులకు: ఫోన్:9347015506

ధన్యజీవి రామయ్య!


అది మట్టి కాదు, మహత్తు. అది విత్తు కాదు, బ్రహ్మాండం. నాటే ప్రతి మొక్కలోనూ తనను తాను చూసుకుంటూ, వృక్ష సేవే మహాయజ్ఞంగా బతికిన 'వనజీవి' రామయ్య జీవితం ధన్యం. చెట్టుకు శిశిర హేమంతాల్లా ఆ చెట్టంత మనిషి బతుకులోనూ ఎన్నో ఎత్తుపల్లాలు. ప్రభుత్వ కార్యాలయాల్లో నాటబోతే అధికారులు అడ్డుపడేవారట. బంజరు భూముల్లో గోతులు తవ్వబోతే స్వార్థపరులు దాడి చేసేవారట. అయినా, ఆయన తన ప్రయత్నాలు మానుకోలేదు. ఆ పచ్చని ప్రయాణాన్ని ఈ పుస్తకంలో కళ్లకు కట్టారు. 'మొక్క చనిపోతే నేను పోయినట్టే బాధపడతా' అనేవారట రామయ్య. 'ఓ వనజీవీ! నీ మొక్కలు బతికే ఉన్నాయి, ఆ మొక్కలతో పాటూ నువ్వూ!' అంటూ ఆయన ఆత్మశాంతికి ప్రార్థిస్తారు రచయిత.



వనజీవి జీవితం; రచన: నరేష్ జిల్లా
పేజీలు:120, వెల: రూ.150; ప్రతులకు: ఫోన్: 8187808285

గోపీచంద్ సాహిత్యం

కొందరి సాహిత్యం దశాబ్దాల తర్వాత కూడా పాతవాసన కొట్టదు. అందులోని మనస్తత్వ చిత్రణలూ, సామాజిక విశ్లేషణలూ వర్తమానంతోనూ సరిపోలతాయి. గోపీచంద్ అక్షరాల్లో ఆ నిత్యనూతనత్వం అపారం. ఏమంత మంచి పుస్తకాలు రావడం లేదని అక్షరానికి దూరం అవుతున్న సీనియర్ పాఠకులకైనా, ఇప్పుడిప్పుడే తెలుగు కథతో పరిచయం పెంచుకుంటున్న నవతరం పుస్తకాభిమానులకైనా... తొలిసారి చదవడానికైనా, మళ్లీ మళ్లీ చదవడానికైనా గోపీచంద్ సాహిత్యం తిరుగులేని ఎంపిక. 'క్లాసిక్ బుక్స్' అందిస్తున్న 'పతితులు-మరికొన్ని కథలు', 'ఆత్మగతం-మరికొన్ని కథలు', 'కూపస్థ మండూక్యం- మరికొన్ని కథలు', 'ధర్మవడ్డీ-మరికొన్ని కథలు', 'యమపాశం' (నవల)... మనం చూసిన సమాజంలోనే చూడని కోణాల్ని పరిచయం చేస్తాయి. అరటిపండు ఒలిచిపెట్టినట్టు కాకుండా, పాఠకుల ఊహాశక్తికి కూడా కొంత వదిలేయడం గోపీచంద్ ప్రత్యేకత.



గోపీచంద్ రచనలు
పేజీలు: 182, వెల: రూ.175 (ఒక్కొక్కటి)
ప్రతులకు: ఫోన్: 8522002536


బంధాలూ అనుబంధాలూ

నదీ ప్రవాహం... ఎక్కడో మొదలై, ఇంకెక్కడో మలుపులు తిరిగి, మరెక్కడో సముద్రంలో కలుస్తుంది. జీవితమూ అంతే. పొత్తూరి విజయలక్ష్మి 'మనసా తుళ్లిపడకే!' నవలలో శైలజ జీవితం కూడా ప్రవాహ సదృశమే. పెద్దలు కుదిర్చిన పెళ్లే అయినా, ఆమె జీవన యాత్రలో అనేక అవరోధాలు. పంతాలూ పట్టింపులూ ఆలూమగల్ని విడదీస్తాయి. ఎన్ని కష్టాలొచ్చినా నిబ్బరంగా పోరాడుతుంది, సమస్యలకు ఎదురొడ్డి నిలుస్తుంది. నాలుగైదు దశాబ్దాల నాటి వాతావరణంలో అనేకానేక మలుపులతో సాగిపోయే కథ పాఠకులతో చివరిదాకా చదివిస్తుంది. జీవన్నాటకంలోని అన్ని రసాలనూ సమతూకంతో పండించారు రచయిత్రి.



మనసా తుళ్లిపడకే (నవల); రచన: పొత్తూరి విజయలక్ష్మి
పేజీలు: 200, వెల: రూ.175; ప్రతులకు: ఫోన్:8522002536

బుక్ షెల్ఫ్



ధర్మమే దైవం (వ్యాస సంపుటి)
రచన: కొల్లు రంగారావు; పేజీలు: 93; వెల: రూ.155
ప్రతులకు: కె.రమ, ఫ్లాట్ నం.204 ఎ, మైత్రి ది టౌన్ శైలి గార్డెనియా, యాప్రాల్, సైనిక్‌పురి, సికింద్రాబాద్.

తప్పిపోయిన కాలం (కవిత్వం)
రచన: మడిపల్లి రాజ్‌కుమార్
పేజీలు:120, వెల: రూ.100
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

నువ్వే ఒక సమూహం (కవిత్వం)
రచన: మహమ్మద్ హుసేన
పేజీలు:82, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9908059234

అంపశయ్య నవీన్ కథలు - ఒక పరిశీలన
రచన: కర్రె సదాశివ్; పేజీలు:130, వెల: రూ.200
ప్రతులకు: నవచేతన, నవోదయ పుస్తక కేంద్రాలు

జీవనదానం (ఆధునిక వైద్య దానాలు-వాస్తవ చిత్రణ)
రచన: పెన్మెత్స సుబ్బరాజు
పేజీలు: 200, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9491184911

తెలుగు సినిమాల జాబితా (1932 - 2024)
సంకలనం: ఆకురాతి శేషాచలం
పేజీలు: 361; వెల: రూ.800
ప్రతులకు: 8125482489

బంగ్లాదేశ్ హిందువుల నరమేధం
రచన: బొమ్మరాజు సారంగపాణి; పేజీలు:194, వెల: రూ.250
ప్రతులకు: ఫ్లాట్ నం.ఎఫ్-9, యురేకా కోర్ట్ కాంప్లెక్స్, ఎల్లారెడ్డి గూడ, అమీర్‌పేట, హైదరాబాద్.

రాశి ఫలం

గ్రహబలం
(ఆగస్టు 31 - సెప్టెంబరు 6)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కాలం సహకరిస్తుంది. మంచి ఫలితాలు సాధిస్తారు. పరిస్థితులకు తగినట్టు నిర్ణయాలు తీసుకోవాలి. ఆలోచనల్లో స్థిరత్వం తప్పనిసరి. ఆర్థిక వ్యవహారాల్లో ప్రగతి ఉంటుంది. అధికారుల మన్ననలు అందుతాయి. కొందరు అవరోధాలు సృష్టించే ఆస్కారం ఉంది. వ్యాపారంలో జాగ్రత్తలు అవసరం. వారం చివర్లో కలిసొస్తుంది. దుర్గమ్మను స్మరించండి.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదృష్టయోగం ఉంది. ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో మేలు చేస్తాయి. వ్యాపారంలో అభివృద్ధిని సాధిస్తారు. పొదుపు అవసరం. అపార్థాలకు ఆస్కారం ఇవ్వకండి. ఉద్యోగులు ఆత్మవిశ్వాసంతో బాధ్యతల్ని నిర్వర్తించాలి. ఓర్పుతో వ్యవహరించాలి. ఆత్మీయుల సూచనలు మేలు చేస్తాయి. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

మనోబలంతో పనుల్ని ప్రారంభించండి. వేగవంతంగా విజయాలు లభిస్తాయి. ఉద్యోగంలో ఉన్నత స్థితి గోచరిస్తోంది. పరిస్థితుల్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలి. అనవసర విషయాల్లో జోక్యం వద్దు. ఆర్థికంగా మేలు జరుగుతుంది. అందివచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోండి. ఆత్మీయుల సహకారం అందుతుంది. ఆరోగ్యం జాగ్రత్త. పరమేశ్వరుడిని ధ్యానించండి.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వ్యాపారం లాభదాయకం. ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. నలుగురికీ మేలు చేస్తారు. గతంలో ఆగిపోయిన పనులు పూర్తవుతాయి. సౌమ్యంగా సంభాషించండి. వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకండి. వ్యాపార వ్యవహారాల్లో అశ్రద్ధ నష్టాలకు కారణం కావచ్చు. బంధుమిత్రుల సహాయం తీసుకోండి. ధనయోగం ఉంది. సూర్య భగవానుడి అష్టోత్తరం పఠించండి.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మనోబలాన్ని పెంచుకోండి. నిర్ణయాలు లాభదాయకం. దీర్ఘకాలిక వ్యవహారాల్లో ముందస్తు ప్రణాళిక అవసరం. ఆపదల నుంచి బయటపడతారు. చెడును అతిగా ఊహించుకోవద్దు. ఉద్యోగులు తెలివిగా వ్యవహరించాల్సిన సమయం. వ్యాపార వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయండి. నవగ్రహాలను పూజించండి.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఏకాగ్రత అవసరం. పరిస్థితులకు తగినట్టు స్పందించండి. వ్యాపారంలో లాభాలు ఉన్నాయి. స్థిరాస్తి వ్యవహారాల్లో జాగ్రత్తలు అవసరం. వివాదాలకు దూరంగా ఉండండి. వాయిదా మనస్తత్వం పనికిరాదు. ఆత్మీయులతో విభేదాలు నష్టం కలిగిస్తాయి. సామరస్య ధోరణి మంచిది. నవగ్రహాల్ని ధ్యానించండి.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

విజయాలు సాధిస్తారు. వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో ఎదుగుదల ఉంటుంది. అధికారుల సహకారం లభిస్తుంది. నలుగురిలో మంచిపేరు తెచ్చుకుంటారు. ఒకట్రెండు అవరోధాలు ఎదురైనా నిరాశకు గురికావద్దు. ఆవేశం హానికరం. లక్ష్యాలు సిద్ధిస్తాయి. వారాంతంలో ఓ శుభవార్త వింటారు. దైవబలం మిమ్మల్ని కాపాడుతుంది. లక్ష్మీదేవిని ధ్యానించండి.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

విజయాలు గోచరిస్తున్నాయి. మనోబలంతో నిర్ణయాలు తీసుకుని, వాటిని చిత్తశుద్ధితో అమలు చేయండి. ధనలాభం ఉంది. స్వల్ప ప్రయత్నంతోనే అనుకున్నది సాధిస్తారు. ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపార అవరోధాల్ని ఆత్మీయుల సహకారంతో అధిగమిస్తారు. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. కనకధారా స్తోత్రం పఠించండి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఏకాగ్రత పెంచుకోండి. ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోండి. స్థిరంగా నిర్ణయాలు తీసుకోండి. మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. అయినా సరే, అంతిమ విజయం మీదే. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశావాదం అవసరం. సౌమ్యంగా సంభాషించండి. రుణ సమస్యలతో జాగ్రత్త. సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఉపాసించండి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

శ్రమకు తగిన ప్రతిఫలం అందుతుంది. మనోధైర్యం అవసరం. కొందరు ఇబ్బందులు సృష్టించే ప్రయత్నం చేస్తారు. అలాంటి వారికి తెలివిగా జవాబు చెప్పండి. మొదలు పెట్టిన పనుల్ని మధ్యలోనే ఆపేయకండి. లావాదేవీల్లో లౌక్యం అవసరం. వారాంతంలో మేలు జరుగుతుంది. నవగ్రహాల్ని పూజించండి.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

కాలం మిశ్రమంగా ఉంటుంది. ఏ విషయంలోనూ అశ్రద్ధ వద్దు. కొందరి ప్రవర్తన అనుమానాస్పదంగా అనిపిస్తుంది. సొంత నిర్ణయాలు వద్దు. వాయిదా మనస్తత్వం వల్ల ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. కలహాలకు అవకాశం ఇవ్వకండి. కుటుంబసభ్యుల సలహాలు తీసుకోండి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండండి. నవగ్రహ ధ్యాన శ్లోకాలను పఠించండి.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఫలితాలు అత్యుత్తమం. గుర్తింపు లభిస్తుంది. పెద్దల ఆశీస్సులు అందుతాయి. వ్యాపారం విస్తరిస్తుంది. తెలివితేటలతో నలుగురినీ మెప్పిస్తారు. పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. కొత్త నైపుణ్యాలను పెంచుకుంటారు. ఇంట్లో శుభాలు జరుగుతాయి. పంచమ శుక్రయోగం కలిసొస్తుంది. మాటతీరులో ఆత్మవిశ్వాసం అవసరం. విష్ణుమూర్తిని ఉపాసించండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. మోసం, దగా (3)
3. వెం(ట్రుక (3)
5. అప్పు, చేబదులు (3)
7. పార్వతి (2)
8. గీతలు (3)
9. ఒక భాష నుంచి మరో భాషలోకి అనువాదం (3)
10. అడ్డం 20తో 'వెళ్దాం... నడవండి!' (1)
11. చిన్న జడను పెద్దదిగా చెయ్యాలంటే ఇది కావాల్సిందే (3)
13. రెండు చేతులతో గొంతు 'పిసుకు' (3)
15. ఆ బడిలో ఒకటో '.....' నుంచి ఐదు దాకానే ఉంది (4)
16. సత్యభామ చేతిలో హతమైనవాడు (4)
18. ఒక రాశి; కుండ (2)
19. రక్కసుడు (4)
20. మాట (2)
22. పావనం (3)
23. ముక్కుకు ఆభరణం (3)
25. స్నేహితుడు (4)
27. వాలం... బహువచనం (3)
29. వసుధ (3)
30. అడ్డం 10తో పుత్తడి (1)
31. ఆరో తిథి (2)
32. లక్ష్మీదేవి (4)
35. సం(క్రాంతి (4)
38. ముళ్ళమండలు లేదా ఎండుమొక్కల పోగు (2)
39. పక్షిని బంధించి ఉండే గూడు (3)
41. వెనకటి రోజుల్లో ముస్లిం రాజులను ఇలా పిలిచేవారు (3)
42. కుడి ఎడమైన బంటు (2)
43. ఇడ్లీల్లోకి పప్పుచారు (3)
44. జత; తోడు (2)
45. భారతీయ చి(త్రకళకు ఈ గుహలు ఎంతో (ప్రసిద్ధి (3)
46. ఛ(త్రం (3)

1	2		✿	3	4		✿	5	6		✿
7		✿	8			✿	9			✿	10
	✿	11			✿	12	✿	13		14	✿
15				✿	16		17		✿	18	
	✿		✿	19				✿	20		✿
✿	21	✿	22			✿	23			✿	24
25		26		✿	27	28		✿	29		
	✿		✿	30	✿		✿	31		✿	
32	33		34	✿	35		36		✿	37	✿
38		✿	39	40		✿		✿	41		
✿	42		✿		✿	43			✿		✿
44		✿	45			✿		✿	46		

నిలువు

1. బంకించంద్ర ఛటర్జీ రాసిన దేశభక్తి గీతం (5)
2. రుచి (2)
3. కొండ కొన (3)
4. రోకలికి జంట (2)
5. కిరీటి అంటే ఎవరు? (4)
6. కర్చీఫ్ (3)
8. ఒక నక్ష(త్రం; బలరాముడి భార్య (3)
11. సరాసరి, ఇంచుమించు (3)
12. తల (3)
14. ఎ(ర్ర తామర (3)
16. తారతో, చుక్కతో (4)
17. వినాయకుడికి (ప్రీతిపా(త్రమైనవి (4)
19. 'అశ్వత్థ' వృక్షం (2)
20. (బహ్మ (4)
21. భావన, ఉ(త్ప్రేక్ష (2)
22. పిన్న, శిశు (2)
24. సోదా (3)
25. స్వర్గం, అమరలోకం (4)
26. ఏడు రోజులా? (3)
28. కటువు, పరుషం (3)
31. (ప్రభాస్ 'వర్షం' నుంచి కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్'దాకా ..... ఒక హీరోయిన్- తలకిందులుగా (2)
33. మోసగాడు, దగాకోరు (4)
34. తపస్సు (2)
35. తుదిలేని 'సంరంభం' (2)
36. ఇది తిరుగులేని శరమని (ప్రతీతి! (4)
37. నెలరాజు (4)
40. తామర (3)

సుడోకు

	3	9	4			8		
						4	7	9
			1		9			
7			2		6			1
9		1	8		5	3		4
8			3		1			6
			7		4			
1	8	2						
		4			8	6	3	

గతవారం సమాధానాలు


పదకేళి

1 ఉ	ర	2 గం	✿	3 పు	ట్ట	4 గొ	డు	5 గు	✿	6 ప	న్న
ద	✿	7 ధ	రి	త్రి	✿	రై	✿	8 మా	ని	ని	✿
9 యా	గ	మా	✿	10 క	11 వి	✿	12 పి	స్తా	✿	13 వా	14 వి
ద్రి	✿	15 ద	16 శ	✿	17 ప్ర	18 మి	ద	✿	19 క	డు	పు
✿	20 అ	నం	త	రం	✿	21 స	ప	22 ర్యా	లు	✿	ల
23 బ	రి	✿	మా	✿	24 లే	మి	✿	25 భా	వ	న	✿
హు	✿	26 వా	సం	తా	✿	27 స	ఖి	✿	లు	✿	28 మ
29 మ	యు	స	భ	✿	30 పా	లు	✿	31 దొ	✿	32 వె	ట్టి
తి	✿	33 వి	వ	34 రం	గా	✿	35 చె	ర	36 సా	ల	✿
✿	37 క	✿	38 తి	గ	✿	39 బా	వి	✿	మ్యం	✿	40 స
41 సె	ల	42 వా	✿	43 వ	రు	డు	✿	44 చెం	✿	45 దా	ర
✿	46 పి	న	త	ల్లి	✿	47 గ	ణ	ప	తి	✿	యు

సుడోకు

9	8	3	6	4	2	7	1	5
2	7	1	5	8	3	6	9	4
5	4	6	9	1	7	2	3	8
6	5	4	1	3	9	8	7	2
8	1	2	4	7	6	9	5	3
3	9	7	2	5	8	4	6	1
4	3	8	7	9	5	1	2	6
1	2	9	3	6	4	5	8	7
7	6	5	8	2	1	3	4	9


ప్రకృతినీ కుట్టేశారు!

















కళ ఉండాలే కానీ చేతిలో ఉన్న చిన్న వస్తువుతోనూ అద్భుతాలు సృష్టించొచ్చు. ఇదిగో ఇక్కడున్న చిత్రాల్ని చూస్తే 'అవును నిజమే' అని మీరూ ఒప్పుకుని తీరతారు. ఈ ఫొటోల్లోని కొండలూ, కోనలూ, మిద్దెలూ, మేడలూ, జంతువులూ, మనుషులూ... సకలం సూదీదారంతో పుట్టినవే. కాస్త మందంగా ఉండే ఎంబ్రాయిడరీ ఊలు దారాలతో చిన్న చిన్న పూలనీ, తీగల్నీ అందంగా కుట్టడమే అందరికీ సాధ్యం కాదు. అలాంటిది సన్నని దారాల్ని వాడుతూ చూడచక్కని ప్రకృతి దృశ్యాల్ని సైతం తీర్చిదిద్దడం అంటే గొప్ప విషయమేగా మరి. క్లాత్ మీద అనుకున్న చిత్రాన్ని గీసుకుని అందుకు తగ్గట్టు రంగుల దారాలతో ఎంతో నిదానంగా కుడుతుంటారు. బొమ్మ ఆకారానికి తగ్గట్టు కుట్లు కూడా మారుస్తూ సహజమైన ఆకృతిని తెప్పిస్తున్నారు. అదాటున చూస్తే గీసిన బొమ్మల్లా మాయ చేస్తున్న ఈ ఆర్ట్‌కి ఎవరైనా ఫిదా కావాల్సిందే!





తోట నిండా విరిసిన గులాబీలే మనసును మైమరపింప చేస్తే- ఆ అందానికి కారణమైన అదే గులాబీ వర్ణంతో మెరిసిపోయే ఈ సరస్సు మరెంత కనువిందు చేస్తుందీ! ఆ ప్రత్యేకతే ఈ 'పింక్ లేక్'ను మనోహరమైన ప్రకృతి దృశ్యాల్లో ఒకటిగా చేర్చింది. ఆస్ట్రేలియాలోని మిడిల్ ఐలాండ్‌లో సముద్రపు అంచున ఉండే ఈ సరస్సు ఎప్పుడూ రోజాల రంగులో దర్శనమిస్తుంది. నీళ్లలోని ఉప్పు, డునాలియెల్లా సాలినా, రెడ్ ఆల్గేలే ఈ గులాబీ రంగుకు కారణమట. ఆ వర్ణరంజితమైన సరస్సుకు నీలి సముద్రం ఒకవైపూ, పచ్చటి చెట్లు మరోవైపూ మరిన్ని వన్నెలు అద్దుతున్నాయి కదూ!

